VELTHURU TELUGU DAILY

# వెలుతురు

## తెలుగు దిన పత్రిక

హైదరాబాద్
శుక్రవారం 22.05.2026

సంపుటి: 07 సంచిక: 347
పేజీలు: 12 వెల: రూ. 5/

Velthuru Newspaper

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA I ANDHRA PRADESH




## తిరుమలలో భక్తుల భారీ రద్దీ

వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు పూర్తిగా నిండిపోయిన పరిస్థితి
సర్వదర్శనానికి 24 గంటలకుపైగా సమయం

2

# 'ధరణి' తెచ్చిన తిప్పలు తప్పిస్తాం.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు!



- నాడు దొరల గడీల్లో బందీ అయిన భూ రికార్డులు.. నేడు పేదల చేతుల్లోకి పట్టాలు
- రాష్ట్రాన్ని రూ.8.18 లక్షల కోట్ల అప్పుల్లో ముంచినా.. సంక్షేమానికి వెనకడుగు వేయం
- ఎన్నికల నాటి 'బొమ్మల ఇళ్ల' నాటకాలకు చెక్.. రూపాయి లంచం లేకుండా నేరుగా ఖాతాల్లోకే నగదు

సత్తుపల్లి వెలుతురు మే 21:

"గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ధరణి పోర్టల్‌లోని లోపాల వల్ల పేదలు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు గడీల పెత్తనంలో బందీ అయిన భూ రికార్డులను విడిపించి, భూములపై పేదలకే సర్వాధికారాలు కల్పిస్తాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్ లో స్థానిక శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రజా దర్బార్' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. వందలాదిగా తరలివచ్చిన ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించి, గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ..మిగతా 2లో



# సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ పునాది

- సాంకేతిక విప్లవానికి మార్గదర్శకుడిగా కొనియాడిన ముఖ్యమంత్రి
- కంప్యూటర్, ఐటీ, టెలికామ్ రంగాల ప్రవేశానికి కీలక పాత్ర
- మహిళా సాధికారతకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు
- తెలంగాణ సాధనలో సోనియా గాంధీ పాత్రపై ప్రశంసలు
- మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు
- బిల్లును పార్లమెంట్‌లో వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్

### తెలంగాణ సమాజం ఆయనకు రుణపడి ఉంది

### వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి నివాళులు

హైదరాబాద్ వెలుతురు మే 21:

దేశ అభివృద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత రాజీవ్ గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవానికి పునాది వేసిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. కంప్యూటర్, ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాలను భారతదేశానికి పరిచయం చేయడం ద్వారా దేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. గ్రామీణ భారతాన్ని సాంకేతికతతో అనుసంధానం చేయాలన్న ఆయన ఆలోచనలు నేటి డిజిటల్ ఇండియాకు మార్గదర్శకంగా నిలిచాయని వివరించారు. రాజీవ్ గాంధీ యువతపై అపార విశ్వాసం ఉంచారని, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మిన నాయకుడిగా ఆయన నిలిచారని సీఎం అన్నారు. 18 సంవత్సరాల వయస్సులోనే ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచారని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా మహిళా సాధికారతకు బలమైన పునాది వేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో సోనియా గాంధీ పాత్రను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకుని సోనియా గాంధీ తీసుకున్న సాహసోపేత నిర్ణయంతోనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. తెలంగాణ సమాజం సోనియా గాంధీ కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ..మిగతా 2లో




## "కాక్రోచ్ జనతా పార్టీ" ఎక్స్ ఖాతా బ్యాన్

2

- అనధికారిక రాజకీయ ప్రచార ఆరోపణలతో భారత్‌లో నిలిపివేత
- వారం రోజుల్లోనే సీజేపీ ఖాతా సస్పెన్షన్ సోషల్ మీడియాలో చర్చనీయాంశం
- ఖాతా నిలిపివేత సమయానికి దాదాపు రెండు లక్షల ఫాలోవర్లు ఉన్నట్లు వెల్లడి
- కేవలం ఐదు రోజుల్లో ఇన్‌స్టాగ్రామ్‌లో 14 మిలియన్లకు పైగా ఫాలోవర్లు సంపాదించిన సీజేపీ
- బీజేపీ ఫాలోవర్లను దాటి సోషల్ మీడియాలో భారీ వైరల్‌గా మారిన ఉద్యమం
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యల నేపథ్యంలో ప్రారంభమైన వ్యంగ్య ఉద్యమం
- "కాక్రోచ్ జనతా పార్టీ" డిజిటల్ వేదికను ప్రారంభించిన అభిజిత్ దీప్కే



2

## భాగ్యనగరంలో మైక్రోసాఫ్ట్ భారీ డేటా సెంటర్

- మరికొన్ని నెలల్లోనే అందుబాటులోకి రానున్న ప్రాజెక్ట్
- దక్షిణ భారత ఐటీ హబ్‌లో శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు పెరుగుతున్న డిమాండే ప్రధాన కారణం
- హైదరాబాద్ ప్రాజెక్టు కోసం రూ.1.45 లక్షల కోట్ల భారీ పెట్టుబడి ప్లాన్
- కొత్త డేటా రక్షణ చట్టం నిబంధనలకు అనుగుణంగా స్థానిక సర్వర్ల ఏర్పాటు
- గూగుల్, అమెజాన్ సంస్థల నుంచి గట్టి పోటీ ఉన్నా మౌలిక వసతుల్లో ముందంజ
- షాద్‌నగర్, చందన్‌వెల్లి పరిసర ప్రాంతాల్లో విస్తరించిన డేటా సెంటర్ల సముదాయం
- మైక్రోసాఫ్ట్ ఏఐ సేవలను భారీగా వినియోగిస్తున్న దేశీయ ఐటీ దిగ్గజాలు
- అభివృద్ధి పనుల్లో పారదర్శకతకు పెద్దపీట



2

## కార్మికులకు భారీ వేతన పెంపు

1.11 కోట్ల మందికి లబ్ధి చేకూరుతుందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆమోదం
- అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ కేటగిరీలుగా విభజన
- మూడు జోన్ల విధానం ద్వారా వేతన నిర్మాణం
- జూన్ 1 నుంచి కొత్త వేతనాలు అమల్లోకి వస్తాయని ప్రకటన

## ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టేసిన మోదీ



- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు
- ఎన్నికల మీదున్న శ్రద్ధ ఆర్థిక వ్యవస్థపై లేదు

2



## ఎబోలా వైరస్ కల్లోలం

11

- భారత్‌లో ముందస్తు హై అలర్ట్
- విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ షురూ
- ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులపై నిఘా



2

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తెలంగాణ రైతుల సమస్యలు, పంటల కొనుగోలు, ఉద్యాన పథకాల నిధులపై సమగ్ర వినతిపత్రాలు సమర్పణ

మొక్కజొన్న, జొన్న పంటలను పీఎస్ఎస్ (PSS) పరిధిలోకి తీసుకోవాలని విజ్ఞప్తి

## క్యూబాపై ట్రంప్ నజర్

కరీబియన్ సముద్రంలోకి అమెరికా యుద్ధనౌకలు

2




# రాష్ట్రానికి రూ.5681 కోట్ల యూసీఎఫ్ నిధులు

- 3 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన కేంద్రం
- వరంగల్ కు రూ.4674 కోట్లు, కరీంనగర్ కు రూ.840 కోట్లు, ఖమ్మం కరీంనగర్ కారిడార్ డిజిటల్ గవర్నెన్స్ కు రూ.166 కోట్లకు ఆమోదం
- కేంద్ర, రాష్ట్రాల వాటా 50 శాతం
- మిగిలిన 50 శాతం హడ్కో రుణం ద్వారా సేకరణ

కరీంనగర్ వెలుతురు మే 21:

తెలంగాణ, ఏపీసహా దేశవ్యాప్తంగా 6 రాష్ట్రాలు యూసీఎఫ్ కింద 17 ప్రాజెక్టుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపాయి. ఈప్రాజెక్టుల విలువ మొత్తం రూ.14,867.88 కోట్లు. వీటికి కేంద్రం ఆమోదం తెలిపింది. తెలంగాణ విషయానికొస్తే....3 ప్రతిపాదనలు రాష్ట్ర ప్రభుత్వం పంపగా వాటికి ఆమోదం తెలిపింది. వీటిలో 1.ఖమ్మం వరంగల్ కరీంనగర్ కారిడార్, 2.వరంగల్ మురుగునీటి ఆధునీకరణ, 3.కరీంనగర్ మోడల్ రోడ్లు, స్కై వాక్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, నాన్ మోటరైజ్డ్ ట్రాన్స్ పోర్ట్ (మోటార్, ఇంధనం ఉపయోగించే రవాణా వాహనాలు) వంటివి ఉన్నాయి. ఈ మూడు ప్రాజెక్టుల విలువ మొత్తం రూ.5681.04 కోట్లు. ఇందులో కేంద్రం 25 శాతం నిధులను ఇవ్వనుంది. అందులో భాగంగా రూ.1420.26 కోట్లను విడుదల చేసింది. అట్లాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం తన వాటాగా 25 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా, మిగిలిన మొత్తాన్ని హడ్కో రుణం రూపంలో కేంద్రం నిధులను సమకూర్చనుంది. ఈ మేరకు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ కార్యదర్శి హీరాలాల్ మిశ్రా నుండి ..మిగతా 2లో





హైదరాబాద్ కి విచ్చేసిన పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి గారిని హోటల్ మారియట్ లో మర్యాద పూర్వకంగా కలిసిన మంత్రి పొన్నం ప్రభాకర్ గారు

## కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్ వెలుతురు మే 21:

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, చేనేత & జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ రోజు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను మర్యాదపూర్వకంగా కలిసి తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న పరిస్థితులు, రైతుల ఆర్థిక ఇబ్బందులు, పంటల మార్కెట్ పరిస్థితులు, ఉద్యాన రంగ విస్తరణ అవసరాలు, పంటల కొనుగోలు సమస్యలు, భవిష్యత్ వ్యవసాయ విధానాలపై మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం, పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ, ఉద్యాన రంగ ప్రోత్సాహం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు తీసుకుంటున్నామని, అయితే కొన్ని అంశాల్లో కేంద్ర ప్రభుత్వ మద్దతు అవసరమని వివరించారు. ప్రధానంగా మొక్కజొన్న మరియు జొన్న పంటల సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణలో యాసంగి 202526 సీజన్‌లో మొక్కజొన్న మరియు జొన్న పంటల సాగు సుమారు 20.29 లక్షల ఎకరాల్లో జరిగిందని, దాదాపు 47.23 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా ఉన్నదని తెలిపారు. అనుకూల వాతావరణ పరిస్థితులు, అధిక దిగుబడుల కారణంగా మార్కెట్ యార్డులకు భారీగా దిగుబడులు వస్తుండటంతో ధరలు తీవ్రంగా పడిపోయాయని వివరించారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్ మొక్కజొన్న ధర సుమారు రూ.1,800 వరకే ఉండగా, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన MSP రూ.2,400గా ఉన్నదని తెలిపారు. దీనివల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి రూ.5681 కోట్ల యూసీఎఫ్ నిధులు

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ అందింది. తొలుత రాష్ట్ర ప్రభుత్వం పంపిన యూసీఎఫ్ ప్రతిపాదనల జాబితాలో కరీంనగర్ లేదు. వరంగల్ కార్పొరేషన్ ప్రతిపాదనలను మాత్రమే యూసీఎఫ్ స్కీంలో చేర్చారు. ఖమ్మం వరంగల్ కరీంనగర్ కారిడార్ ను కూడా ఈ స్కీంలో చేర్చారు. అందులో భాగంగా ఆయా ప్రతిపాదనలకు సంబంధించి డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక)ను కూడా కేంద్రానికి పంపారు. ఈ విషయం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను సైతం యూసీఎఫ్ జాబితాలో చేర్చాల్సిందేనని పట్టుబట్టారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కరీంనగర్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న వెంటనే కరీంనగర్ అభివృద్ధి, ఆధునీకరణ లో భాగంగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆగమేఘాల మీద ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి పంపారు. ఇదే అంశంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ లను కలిసి ఈ ప్రతిపాదనలను ఆమోదించాలని కోరారు. పలుమార్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతోనూ చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కరీంనగర్ ప్రతిపాదనలను ఆమోదించాలంటూ పట్టుపట్టారు. బండి సంజయ్ ఆగమేఘాలపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ నుండి వచ్చిన 3 ప్రతిపాదనలకు యూసీఎఫ్ నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం తెలిపింది.

## "కాక్రోచ్ జనతా పార్టీ" ఎక్స్ ఖాతా బ్యాన్

న్యూఢిల్లీ వెలుతురు మే 21:

సామాజిక మాధ్యమాల్లో ఇటీవల సంచలనంగా మారిన "కాక్రోచ్ జనతా పార్టీ (CJP)" ఎక్స్ (X) ఖాతాను భారత్‌లో నిలిపివేయడం తీవ్ర చర్చకు దారితీసింది. అనధికారిక రాజకీయ ప్రచార వేదికగా ప్రారంభమైన వారం రోజుల్లోనే ఈ ఖాతాను నిలిపివేసినట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వెల్లడించారు. ఖాతా నిలిపివేసే సమయానికి దానికి దాదాపు రెండు లక్షల మంది ఫాలోవర్లు ఉన్నట్లు తెలిపారు. ఇదే సమయంలో, కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే సీజేపీకి చెందిన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా 14 మిలియన్లకు పైగా ఫాలోవర్లను సంపాదించడం కూడా గమనార్హం. అంతేకాకుండా ఈ ఉద్యమం పేరుతో ఒక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఇటీవల కొంతమందిని "బొద్దింకలతో" పోల్చుతూ చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీశాయి. ఆ వ్యాఖ్యల నేపథ్యంలోనే వ్యంగ్యాత్మకంగా "కాక్రోచ్ జనతా పార్టీ" అనే డిజిటల్ వేదికను అభిజిత్ దీప్కే ప్రారంభించినట్లు సమాచారం. అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీలో పబ్లిక్ రిలేషన్స్‌లో మాస్టర్స్ పూర్తిచేసిన ఆయన ఈ ఆన్‌లైన్ క్యాంపెయిన్‌ను రూపొందించారు. ఈ వేదికలో చేరేందుకు కావాల్సిన అర్హతలు, మ్యానిఫెస్టో, విజన్ వంటి అంశాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. అయితే, తన వ్యాఖ్యలను కొన్ని మీడియా వర్గాలు వక్రీకరించాయని సీజేఐ ఇప్పటికే వివరణ ఇచ్చిన విషయం తెలిసిందే. ఖాతా నిలిపివేసిన తర్వాత కూడా ఈ డిజిటల్ ఉద్యమం ఆగలేదు. "కాక్రోచ్ ఈజ్ బ్యాక్" పేరుతో కొత్త ఎక్స్ ఖాతాను ప్రారంభించినట్లు అభిజిత్ దీప్కే తెలిపారు. తమ పాత ఖాతాను హ్యాక్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, అందుకే ఇలాంటి పరిస్థితి ఎదురైందని ఆయన పేర్కొన్నారు. కొత్త ఖాతా ప్రారంభించిన కొద్దిసేపటికే దానికి కూడా 16 వేల మందికి పైగా ఫాలోవర్లు చేరినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితులపై న్యాయపరంగా ముందుకు వెళ్లాలని ఆయన స్పష్టం చేశారు.

## వైభవంగా ప్రారంభమైన సరస్వతి అంత్య పుష్కరాలు

- పన్నెండు రోజుల పాటు కొనసాగే సరస్వతి అంత్య పుష్కరాలు

కాళేశ్వరం వెలుతురు మే 21:

పన్నెండు రోజుల పాటు కొనసాగే సరస్వతి అంత్య పుష్కరాలు గురువారం నాడు కాళేశ్వరం పుష్కరఘాట్ లో వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి ఉదయం 5.43 గంటల పవిత్ర ముహూర్తంలో తొలిస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు శ్రీ గోవింద హరి తదితరులు పుష్కర ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పుణ్యస్నానమాచరించారు. భూపాలపల్లి శాసనసభ్యుడు గండ్ర సత్యనారాయణ రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి లు కూడా పుష్కరస్నానం ఆచరించి వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. పుష్కరాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పవిత్ర స్నానాలు ఆచరిస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, ప్రత్యేక అంబులెన్సులు, రవాణా సదుపాయం వంటి అన్ని ఏర్పాటు చేశారు. ఈ పుణ్యకాలంలో భక్తులు సౌకర్యవంతంగా, సురక్షితంగా పుష్కర స్నానాలు నిర్వహించుకునేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పుష్కరాల సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించే భక్తుల కోసం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పలు ధార్మిక సంఘాలు ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తున్నాయి, కాళేశ్వరంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ఎండ తీవ్రతనుంచి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నారు. ఆలయ విశిష్టత: భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఒకే పానవట్టంపై యముడు (కాళేశ్వరుడు) శివుడు (ముక్తేశ్వరుడు) కొలువై ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత.

# 'ధరణి' తెచ్చిన తిప్పలు తప్పిస్తాం.. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

నాడు కాగితాల మోసం.. నేడు అకౌంట్లలోకి కాసులు ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు అడ్డగోలుగా రూ.8 లక్షల 18 వేల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. "అప్పులు ఉన్నాయని నెపంతో మేము చేతులు ముడుచుకుని కూర్చోలేదు. ఉన్న వనరులతోనే పేదవాడికి భద్రత, భరోసా కల్పిస్తున్నాం. గత పాలకుల కాలంలో ఎన్నికలు రాగానే ఇందిరమ్మ ఇళ్ల పేరుతో బొమ్మలు చూపించి ఒట్టి కాగితాలకే పరిమితం చేశారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.22,500 కోట్లతో నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికే 1.25 లక్షల ఇళ్లు పూర్తి కాగా, జూన్ నాటికి మరో లక్ష ఇళ్లు సిద్ధమవుతాయి. వచ్చే జూన్ 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని ఘనంగా ప్రారంభిస్తున్నాం" అని ప్రకటించారు. హైదరాబాద్‌లో బటన్ నొక్కితే ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే ప్రతి సోమవారం నిధులు జమ చేస్తున్నామన్నారు. ఇళ్లు కట్టుకునే పేదలకు ములకలపల్లి క్వారీ నుంచి నాణ్యమైన ఇసుకను ఉచితంగా అందిస్తామని చెప్పారు. గత పాలకుల హయాంలో నిరుద్యోగులను రోడ్డున పడేస్తే.. తమ ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలోనే 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలోనే మరో కొత్త కొలువుల ప్రకటన రాబోతుందని తెలిపారు.

**కాలపరిమితి లోగా భూముల కొలతలు.. పహానీల్లో పేర్లు!**

సత్తుపల్లి పట్టణ పరిధిలోని 399 సర్వే నంబర్ అంశంతో పాటు, చుట్టుపక్కల 9 గ్రామాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాల భూ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. పేదపల్లి, నారాయణపురం పరిసరాల్లోని 5,500 ఎకరాల పైచిలుకు భూములను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో కొలతలు (సర్వే) చేపట్టి, స్వాధీనంలో ఉన్న అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, పహానీలలో వారి పేర్లు ఎక్కించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తికావడానికి రైతులు, స్థానికులు అధికారులకు సహకరించాలని కోరారు. పాత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిధుల బకాయిలు, ఇతర పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, ఒకట్రెండు రోజుల్లోనే ఫలితాలు వస్తాయని చెప్పారు.

**అటవీ అడ్డంకులు వద్దు.. రైతులకు పూర్తి రక్షణ**

రుద్రాక్షపల్లి, కొకపాడు, తాళపెంట, రామచంద్రాపురం, వెంకటగిరి సహా సరిహద్దుల్లోని 1012 గ్రామాల్లో నెలకొన్న అటవీ రెవెన్యూ భూముల వివాదాలపై మంత్రి కఠిన ఆదేశాలు జారీ చేశారు. "ఈ వర్షాకాలం ప్రారంభం అయ్యేలోపే అటవీ సరిహద్దులను కొలిచి తేల్చాలి. మిగిలిన రెవెన్యూ భూమిలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే" అని మంత్రి భరోసా ఇచ్చారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు పొందిన రైతులు సాగు కోసం బోర్లు వేసుకుంటుంటే అటవీ శాఖ అధికారులు ఎక్కడా అభ్యంతరాలు పెట్టవద్దని, జిల్లా అదనపు కలెక్టర్, ఉప కలెక్టర్లు ఈ వ్యవహారాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# తిరుమలలో భక్తుల భారీ రద్దీ

తిరుమల వెలుతురు మే 21:

వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు పూర్తిగా కిక్కిరిసిపోయాయి. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1, 2 పూర్తిగా నిండిపోయాయి. అంతేకాకుండా నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు కూడా పూర్తిగా భర్తీ కావడంతో భక్తులు బాట గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుమలలో ప్రస్తుతం సర్వదర్శనానికి 24 గంటలకుపైగా సమయం పడుతుండటంతో టీటీడీ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు శుక్రవారం ఉదయం 6 గంటల తర్వాత మాత్రమే క్యూలైన్‌లోకి అనుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. దీంతో ముందుగా వచ్చిన భక్తులను కూడా తాత్కాలికంగా వెనక్కి పంపించి, వారిని పీఏసీ సముదాయాలకు తరలిస్తున్నారు. భక్తుల రద్దీని తగ్గించేందుకు అదనపు క్యూలైన్లు, తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసినప్పటికీ అవి కూడా నిండిపోయాయి. మరింత సిబ్బందిని నియమించి పరిస్థితిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

**ముగింపు పరిస్థితి**

ప్రస్తుతం తిరుమలలో పరిస్థితి అత్యంత రద్దీగా ఉంది. దర్శన సమయం పెరగడం, వసతి సమస్యలు, క్యూలైన్లలో ఇబ్బందులు వంటి కారణాలతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో తిరుమలకు తక్షణం రావొద్దని అధికారులు సూచిస్తున్నారు.

## సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ పునాది

(మొదటి పేజీ తరువాయి)

ఉంటుందని అన్నారు. అలాగే కాంగ్రెస్ కుటుంబం దేశ నిర్మాణానికి ఎన్నో త్యాగాలు చేసిందని సీఎం వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య విలువలు, లౌకిక వాదం, సమగ్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ నేతలు చేసిన కృషిని దేశ చరిత్రలో ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంలో కేంద్రం జాప్యం చేస్తోందని ఆరోపించారు. బిల్లును డీలిమిటేషన్ అంశంతో ముడిపెట్టి ఆలస్యం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే ఈ చారిత్రాత్మక బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని ఆయన గుర్తు చేశారు. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగడం ద్వారా సమాజంలో సమానత్వం సాధ్యమవుతుందని తెలిపారు. రాజీవ్ గాంధీ సాంకేతిక దార్శనికత నేటి డిజిటల్ యుగానికి బలమైన పునాది వేసిందని సీఎం పేర్కొన్నారు. ఐటీ రంగం ద్వారా లక్షలాది యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడ్డాయని, భారతదేశం ప్రపంచ స్థాయిలో పోటీ చేయగల స్థితికి చేరిందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా సాంకేతికతను అందుబాటులోకి తేవాలన్న ఆయన ఆలోచనలు ఇప్పటికీ మార్గదర్శకంగా ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, డిజిటల్ పురోగతి కోసం కట్టుబడి పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో విద్య, ఆరోగ్యం, ఐటీ రంగాలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం పిలుపునిచ్చారు.

# ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టేసిన మోదీ

న్యూఢిల్లీ వెలుతురు మే 21:

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత పరిస్థితిపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్లే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోందని, పెట్టుబడులు తగ్గిపోయాయని ఆరోపించింది. సరఫరా గొలుసు నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ సెక్రటరీ జైరామ్ రమేష్ ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ కేవలం ఎన్నికలు గెలవడంపైనే దృష్టి పెట్టారని, దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు అవసరమైన 'కొత్త జ్ఞానం' ఆయనకు ఎంతైనా అవసరమని ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటనను విడుదల చేశారు. మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చే ఆర్థిక నిపుణులు కూడా ఇప్పుడు బహిరంగంగా దేశ ఆర్థిక స్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, దీన్ని బట్టే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ కేవలం ఎన్నికల వ్యూహాలు, ప్రచారాలపైనే పూర్తి సమయాన్ని కేటాయిస్తున్నారని జైరాం రమేశ్ విమర్శించారు. దేశంలో వృద్ధి అంచనాలు రోజురోజుకూ పడిపోతుంటే, ద్రవ్యోల్బణం మాత్రం సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకుంటోందని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను సరైన దారిలో పెట్టడానికి విధానపరమైన మార్పులు చేయాల్సింది పోయి, మోదీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తనను తాను పొగుడుకోవడానికే ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీకి ఇప్పుడు సొంత డబ్బా కొట్టుకోవడం ఆపి, ఆర్థిక ప్రగతిని పెంచేందుకు తక్షణమే కొత్త ప్రణాళికలు అవసరమని స్పష్టం చేశారు. ఇటీవల ఇటలీ పర్యటన సందర్భంగా జరిగిన 'మెలోడీ' టాఫీ వైరల్ ఘటనను ప్రస్తావిస్తూ జైరాం రమేశ్ ప్రధాని మోదీపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. దేశంలో ఎఫ్‌డీఐలు (విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు) పడిపోతున్నా, మార్కెట్ సంక్షోభంలో ఉన్నా పట్టించుకోని ప్రధానమంత్రి, విదేశాల్లో టాఫీలు పంచుతూ బిజీగా గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకు నీతి బోధలు చేయడం ఆపి, వాస్తవ సమస్యలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. సామాన్య ప్రజలు నిత్యావసరాలు కొనలేక ఇబ్బంది పడుతుంటే, ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని విమర్శించారు. దేశంలో పెట్టుబడి వాతావరణం మందగించడంపై కాంగ్రెస్ చాలా కాలంగా హెచ్చరిస్తోందని జైరాం రమేశ్ గుర్తు చేశారు. ప్రైవేట్ కంపెనీలు దేశంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రానంత కాలం ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. కార్పొరేట్ కంపెనీల పన్ను రేట్లను ప్రభుత్వం రికార్డు స్థాయికి తగ్గించిందని, తద్వారా వాటి ఆదాయాలు మరియు స్టాక్ మార్కెట్ వాల్యుయేషన్లు విపరీతంగా పెరిగాయని చెప్పారు. అయితే, ఈ లాభాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని, క్షేత్రస్థాయిలో కొత్త పరిశ్రమల స్థాపనకు లేదా ఉద్యోగాల సృష్టికి ఈ నిధులు ఉపయోగపడటం లేదని ఆరోపించారు. దేశంలో అన్ని ఆదాయ వర్గాల ప్రజల వాస్తవ వేతనాలు గత కొన్నేళ్లుగా ఒకే చోట స్తంభించిపోయాయని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదాయాలు పెరగకపోవడంతో మార్కెట్‌లో వినియోగదారుల డిమాండ్ దారుణంగా పడిపోయిందన్నారు. సామాన్యుల కొనుగోలు శక్తి తగ్గడం వల్ల వ్యాపారాలు మందగించాయని, ప్రజలే తమ వినియోగాన్ని తగ్గించుకోవాలని స్వయంగా ప్రధానమంత్రే బహిరంగంగా కోరడం ప్రభుత్వ విఫల నినాదానికి అద్దం పడుతోందని విమర్శించారు. ప్రజల దగ్గర డబ్బు లేనప్పుడు, కంపెనీలు తమ వస్తువులను కొనేవారు లేక కొత్తగా పెట్టుబడులు పెట్టడానికి భయపడుతున్నాయని వివరించారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశంలోని పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తీవ్ర అభద్రతా భావంతో బతుకుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. పదే పదే పన్ను నోటీసులు పంపడం, పరిపాలనా ఉత్తర్వులతో ఇబ్బంది పెట్టడం, ఈడీ, ఐటీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించి భయభ్రాంతులకు గురిచేయడం పరిపాటిగా మారిందన్నారు. ఈ బెదిరింపుల రాజకీయాల వల్ల వ్యాపార వర్గాల్లో తీవ్ర అనిశ్చితి నెలకొందని, ఫలితంగా భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ సాహసించడం లేదని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

# క్యూబాపై ట్రంప్ నజర్

అమెరికా వెలుతురు మే 21:

అంతర్జాతీయ రాజకీయాల్లో మరో భారీ కుదుపునకు తెర లేచింది. వెనిజులాలో నికోలస్ మదురో పాలనకు చరమగీతం పాడిన అమెరికా, ఇప్పుడు తన తదుపరి లక్ష్యంగా పొరుగునే ఉన్న క్యూబాను ఎంచుకున్నట్లు స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. క్యూబాకు త్వరలోనే విముక్తి కలిగిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా ప్రకటన ప్రపంచవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రకటన వెలువడిన తరుణంలోనే అమెరికాకు చెందిన భారీ విమాన వాహక యుద్ధనౌక 'యూఎస్ఎస్ నిమిట్జ్' తన స్ట్రైక్ గ్రూప్‌తో కలిసి కరీబియన్ సముద్రంలోకి ప్రవేశించడం గమనార్హం. ఈ పరిణామం క్యూబా సరిహద్దుల్లో యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. అమెరికా సైనిక విభాగమైన సౌతెర్న్ కమాండ్ (సౌత్ కామ్) బుధవారం ఈ యుద్ధనౌక మోహరింపును అధికారికంగా ధృవీకరించింది. దాదాపు 90 అధునాతన యుద్ధ విమానాలు, సైనిక హెలికాప్టర్లు, 5 వేల మందికి పైగా సుశిక్షితులైన ఆర్మీ సిబ్బందితో కూడిన ఈ యుద్ధనౌక కరీబియన్ సముద్రంలో మోహరించడంతో అమెరికా క్యూబా దేశాల మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరుకున్నాయి. గతంలో వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను నాటకీయంగా అరెస్టు చేసిన తరహాలోనే, ఇప్పుడు క్యూబాలోనూ అలాంటి తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందనే చర్చ అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ఈ తీవ్ర ఉద్రిక్తతలకు క్యూబా మాజీ అధ్యక్షుడు, 94 ఏళ్ల వృద్ధ నేత రౌల్ క్యాస్ట్రోపై అమెరికా చట్టపరమైన ఉచ్చు బిగించడం ప్రధాన కారణంగా నిలిచింది. రౌల్ క్యాస్ట్రోపై పలు తీవ్రమైన నేరారోపణలను నమోదు చేసే ప్రతిపాదనకు అమెరికాలోని మియామి ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ గత ఏప్రిల్ 23న ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన చారిత్రక చార్జ్‌షీట్ వివరాలను అమెరికా న్యాయశాఖ మే 20న అధికారికంగా బహిరంగపరిచింది. ఈ పరిణామం వెలుగు చూసిన వెంటనే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రంగంలోకి దిగి, క్యూబా ప్రజలకు విముక్తి కాబోతోందంటూ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచె నేతృత్వంలోని న్యాయశాఖ తీసుకున్న ఈ నిర్ణయాన్ని డొనాల్డ్ ట్రంప్ పూర్తిగా అభినందించారు. క్యూబాలో అమెరికా నిఘా సంస్థ 'సీఐఏ' గట్టి పట్టు కలిగి ఉందని, అలాగే అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు క్యూబన్ మూలాలు ఉండటం వల్ల ఆ దేశ అంతర్గత పరిస్థితులపై అమెరికాకు పూర్తి అవగాహన ఉందని ట్రంప్ గుర్తు చేశారు. మియామితో పాటు అమెరికాలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన క్యూబా సంతతి ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారని ఆయన అన్నారు. క్యూబా ప్రస్తుతం ఆర్థికంగా, సామాజికంగా పతనమవుతున్న దేశమని, వారి వద్ద కనీసం చమురు నిల్వలు కూడా లేవని ఎద్దేవా చేశారు. తాము అక్కడి ప్రజలకు మానవతా దృక్పథంతో సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని, క్యూబా పాలకులు ఇప్పటికే దేశంపై నియంత్రణ కోల్పోయారని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## భాగ్యనగరంలో మైక్రోసాఫ్ట్ భారీ డేటా సెంటర్

హైదరాబాద్ వెలుతురు మే 21:

అంతర్జాతీయ ఐటీ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్, తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న తన అతిపెద్ద డేటా సెంటర్‌ను మరికొన్ని నెలల్లోనే అందుబాటులోకి తెచ్చేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. దక్షిణ భారత ఐటీ హబ్‌గా పేరుగాంచిన భాగ్యనగరంలో ఈ భారీ డేటా సెంటర్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా అధ్యక్షుడు పునీత్ చందోక్ ఒక ప్రత్యేక కార్యక్రమంలో వెల్లడించారు. దేశీయ మార్కెట్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ సేవలకు డిమాండ్ రోజురోజుకూ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా పూర్తి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం భారతదేశంలో మైక్రోసాఫ్ట్ అందిస్తున్న అజూర్ క్లౌడ్ సర్వీసెస్‌తో పాటు, కోపైలెట్ 365 ఏఐ అసిస్టెంట్లకు వినియోగదారుల నుంచి విపరీతమైన ఆదరణ లభిస్తోందని పునీత్ చందోక్ తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఐటీ మార్కెట్లలో ఇండియా ముందంజలో ఉందని, ఇక్కడ 100 కోట్ల మందికి పైగా ఇంటర్నెట్ సేవల వినియోగదారులు ఉండటమే కాకుండా సాంకేతిక నైపుణ్యాలు ఉన్న యువత భారీగా లభిస్తున్నారని పేర్కొన్నారు.

## కార్మికులకు భారీ వేతన పెంపు

హైదరాబాద్ వెలుతురు మే 21:

తెలంగాణలో కార్మికుల కనీస వేతనాలను భారీగా పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆయన మీడియాకు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల కనీస వేతనాలను సమీక్షించకపోవడం వల్ల పెద్ద సంఖ్యలో కార్మికులు నష్టపోయారని సీఎం విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస వేతనాల సవరణపై ప్రత్యేకంగా కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ అన్ని వర్గాల కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి కీలక సిఫార్సులు చేసిందని వెల్లడించారు. ఈ సిఫార్సుల ఆధారంగా కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించినట్లు సీఎం తెలిపారు. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ అనే కేటగిరీలుగా వర్గీకరించామని చెప్పారు. అలాగే వేతనాల నిర్ణయానికి రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించినట్లు వివరించారు. జోన్ 1లో మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్ 2లో మున్సిపాలిటీలు, జోన్ 3లో గ్రామీణ ప్రాంతాలు ఉంటాయని తెలిపారు. జోన్ 1 పరిధిలో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.12,750 నుంచి రూ.16,000కు పెంచినట్లు సీఎం ప్రకటించారు. సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ.17,000కు పెరిగిందన్నారు. స్కిల్డ్ కార్మికులకు రూ.13,772 నుంచి రూ.18,500కు, హై స్కిల్డ్ కార్మికులకు రూ.14,607 నుంచి రూ.20,000కు వేతనాలు పెంచినట్లు వెల్లడించారు.

## తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు గద్వాల విజయలక్ష్మికి సత్కారం

- ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు శుభాకాంక్షలు
- మహిళా హక్కుల పరిరక్షణకు మరింత కృషి చేయాలని ఆకాంక్ష






హైదరాబాద్ వెలుతురు మే 21:

తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమితులైన గద్వాల విజయలక్ష్మిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళా కమిషన్ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించడం గర్వ కారణమని పేర్కొంటూ, మహిళల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సాధికారత కోసం మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో మహిళల సమస్యల పరిష్కారం, వారి భద్రత, సామాజిక న్యాయం సాధనలో మహిళా కమిషన్ కీలక పాత్ర పోషిస్తుందని హర్కర వేణుగోపాల్ రావు తెలిపారు. మహిళలకు న్యాయం జరిగేలా ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కమిషన్ సభ్యుల బాధ్యత ఎంతో ముఖ్యమన్నారు.

ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేస్తానని, గ్రామీణ ప్రాంతాల మహిళల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాళ్లు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

- గాంధీ భవన్‌లో సేవా కార్యక్రమాలు నిర్వహణ
- ఖైరతాబాద్ కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో కార్యక్రమం
- రాజీవ్ గాంధీ సేవలను స్మరించిన నాయకులు
- యువత సాధికారతకు ఆయన కృషి చిరస్మరణీయం
- సాంకేతిక అభివృద్ధికి పునాది వేసిన నాయకుడిగా కొనియాడిన నేతలు
- పాల్గొన్న తెలంగాణ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి




హైదరాబాద్ వెలుతురు మే 21:

మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ భవన్‌లో రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాంగ్రెస్ నేత రోహిత్ ముదిరాజ్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువ నాయకులు, మహిళా కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ దేశానికి దూరదృష్టి గల నాయకత్వాన్ని అందించారని పేర్కొన్నారు. యువత సాధికారత, సాంకేతిక అభివృద్ధి, సామాజిక సేవ, సమగ్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు.

ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి మాట్లాడుతూ మానవత్వం, సేవాభావం, లౌకికవాదం, దేశ నిర్మాణం వంటి విలువలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కట్టుబడి ఉంటోందన్నారు. రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు కాంగ్రెస్ సిద్ధాంతాల అసలైన ఆత్మను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు.

## భారత రత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ వెలుతురు మే 21:

భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత నాయకుడు, మాజీ ప్రధాని, 'భారత రత్న' స్వర్గీయ రాజీవ్ గాంధీ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఉన్న తన నివాసంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన రాజీవ్ గాంధీ సేవలు స్మరించుకున్నారు.

**ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ**

"భారతదేశాన్ని 21వ శతాబ్దంలోకి నడిపించిన ఘనత, ఆధునిక సాంకేతిక విప్లవానికి నాంది పలికిన దార్శనికుడు రాజీవ్ గాంధీ. దేశంలో ఐటీ, టెలికాం రంగాల్లో నేడు మనం చూస్తున్న పురోగతి ఆయన వేసిన పునాదే. దేశ సమగ్రత, ఐక్యత కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన అమరవీరుడు రాజీవ్ గాంధీ. ఆయన ఆశయ సాధన కోసం, దేశ పురోభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి." అని పేర్కొన్నారు.

రాజీవ్ గాంధీ చూపిన శాంతి, సామరస్యం, లౌకికవాద మార్గంలో నడుస్తూ, బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, అభిమానులు పాల్గొని అంజలి ఘటించారు.

# గాంధీ భవన్‌లో రాజీవ్ గాంధీ వర్ధంతి

- నివాళి అర్పించిన ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి
- సీనియర్ కాంగ్రెస్ నేతలు, మహిళా కాంగ్రెస్ నేతలతో కలిసి కార్యక్రమం నిర్వహణ



హైదరాబాద్ వెలుతురు మే 21:

ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి పునాది వేసిన నేతగా ప్రశంసలు
డిజిటల్ ఇండియా పునాదులు రాజీవ్ గాంధీ నిర్ణయాల ఫలితమని వ్యాఖ్యలు
ఓటు హక్కు వయస్సు తగ్గింపుతో యువతకు పెద్ద అవకాశం కల్పించిన నేత
యువత సాధికారతకు రాజీవ్ గాంధీ కీలక పాత్ర పోషించారని గుర్తింపు
కాంగ్రెస్ సిద్ధాంతాలతో పనిచేయడం గర్వకారణమని డా. రేఖ బోయలపల్లి వ్యాఖ్య
కార్యక్రమంలో సత్యనారాయణ సహా పలువురు నాయకుల పాల్గొనడం

భారత మాజీ ప్రధాన మంత్రి, ఆధునిక భారత రూపకర్తగా గుర్తింపు పొందిన రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఘన నివాళుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు పుష్పాంజలి ఘటించారు. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకున్నారు.

**ఆధునిక భారత రూపకర్తగా రాజీవ్ గాంధీ**

రాజీవ్ గాంధీ గారు భారతదేశాన్ని ఆధునీకరణ దిశగా నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడని డా. రేఖ బోయలపల్లి అన్నారు. సమాచార సాంకేతికత (ఐటీ), టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధిలో కీలక మలుపు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఆయన పాలనలో ఐటీ రంగానికి ఇచ్చిన ప్రోత్సాహం కారణంగా నేటి డిజిటల్ ఇండియా పునాది పడిందని ఆమె వివరించారు. టెక్నాలజీ ఆధారిత పాలనకు బలమైన దారితీసిన నాయకుడిగా రాజీవ్ గాంధీ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.

**యువత సాధికారతకు కీలక నిర్ణయం**

దేశ యువతకు రాజకీయ హక్కులు కల్పించడంలో రాజీవ్ గాంధీ గారి పాత్ర ఎంతో గొప్పదని ఆమె పేర్కొన్నారు. ఓటు హక్కు వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించడం ద్వారా కోట్లాది యువతకు ప్రజాస్వామ్యంలో ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని కల్పించారని గుర్తు చేశారు. ఈ నిర్ణయం భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచిందని, యువతను రాజకీయ ప్రక్రియలో భాగస్వాములుగా మార్చిందని ఆమె అన్నారు.

**కాంగ్రెస్ సిద్ధాంతాలపై గర్వం**

రాజీవ్ గాంధీ వంటి దూరదృష్టి కలిగిన నాయకుల ఆలోచనలు, అభివృద్ధి దృష్టికోణం ఆధారంగా నడిచే కాంగ్రెస్ పార్టీలో పనిచేయడం తనకు గర్వకారణమని డా. రేఖ బోయలపల్లి తెలిపారు. అభివృద్ధి, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలే కాంగ్రెస్ పార్టీకి బలమని ఆమె అభిప్రాయపడ్డారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉద్వేగ భరిత వాతావరణంలో సాగింది. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి నాయకులు నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీ సత్యనారాయణతో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

**యువ నాయకత్వానికి స్ఫూర్తి**

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ గారి నాయకత్వం నేటి యువ రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. దేశ అభివృద్ధి కోసం ఆయన తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు ఇప్పటికీ సమకాలీనంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. టెక్నాలజీ, విద్య, గ్రామీణాభివృద్ధి రంగాల్లో ఆయన వేసిన పునాదులు భారతదేశ భవిష్యత్తును మార్చాయని అభిప్రాయపడ్డారు. మొత్తానికి గాంధీ భవన్‌లో జరిగిన ఈ వర్ధంతి కార్యక్రమం రాజీవ్ గాంధీ సేవలను స్మరించుకునే సందర్భంగా నిలిచింది. నాయకులు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు కలిసి ఆయనకు ఘన నివాళులు అర్పించడం ద్వారా కార్యక్రమం శ్రద్ధాభక్తులతో ముగిసింది.

# పర్యాటక రంగానికి 'డిజిటల్' బూస్టర్!

- ఇన్ఫ్లుయెన్సర్లు పర్యాటక ప్రమోషన్‌తో పాటు సామాజిక బాధ్యతతో ముందుకు రావాలి
- డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై యువతకు చైతన్యం కల్పించాలి
- త్వరలో 'ప్రభాత భేరి' సామాజిక చైతన్య కార్యక్రమం
- ఉత్తమ టూరిజం క్రియేటర్లకు అవార్డులు, ప్రోత్సాహకాలు
- 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో మంత్రి జూపల్లి కృష్ణారావు




హైదరాబాద్, వెలుతురు మే 21:

"పర్యాటక రంగం కేవలం విహార యాత్రలకే పరిమితం కాదు.. అది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధికి, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు శక్తివంతమైన సాధనం" అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను ప్రపంచానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణను వేగవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇన్ఫ్లుయెన్సర్లు ఇచ్చిన సలహాలు సూచనలు స్వీకరించి పర్యాటక రంగాన్ని మరింత మెరుగుపరుస్తామని చెప్పుతునే.. పర్యాటక ప్రమోషన్ తో పాటు ప్రజల్లో ముఖ్యంగా యువతలో సామాజిక స్పృహ కలిగించడానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

**పర్యాటకంతో ఉపాధి.. రాష్ట్రానికి ఆదాయం**

పర్యాటక ప్రాంతాల ప్రోత్సాహంతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతానికి, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు.

"మన ప్రాంతాలను మనమే చూడకపోతే జీవితం సంపూర్ణం కాదు" అని పేర్కొన్న ఆయన.. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఆర్థిక స్థోమత అడ్డంకి కాదన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని కుటుంబంతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో గడపడం వల్ల మానసిక ప్రశాంతత, ఆనందం లభిస్తాయని సూచించారు.

దేశ, విదేశీ పర్యాటకులతో పాటు స్వరాష్ట్ర ప్రజలు కూడా తెలంగాణ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా సందర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ వసతి సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని తెలిపారు. వినియోగంలో లేని హరిత మోటళ్లు, పర్యాటక భూములను ఆదాయ వనరులుగా మార్చే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కేవలం పర్యాటక ప్రమోషన్‌కే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు. యువత.. గంజాయికి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్‌కు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటితో మానసిక రుగ్మతకు గురై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు ఇన్ఫ్లుయెన్సర్లు తమ కంటెంట్ ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.

**త్వరలో 'ప్రభాత భేరి'**

ప్రభుత్వం ప్రభాత భేరి అనే సరికొత్త సామాజిక చైతన్య కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతుందని, లఘు చిత్రాలు, నాటికలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ కళా రూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యచరణను అమలు చేయబోతున్నామని ప్రకటించారు.

**తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి చాటండి**

తెలంగాణ సంస్కృతి, వారసత్వం, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో క్రియేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే కంటెంట్ క్రియేటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచే టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరపున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు.

**నూతన మెటా ఖాతా ఆవిష్కరణ**

ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ నూతన మెటా ఖాతా, అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. తెలంగాణ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, హస్తకళలు, చేనేత, కలంకారీ కళా వైభవాన్ని ప్రతిబింబించే 'టైమ్‌లెస్ తెలంగాణ' వీడియోను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎండీ గౌతమి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యం బలపడాలంటే ఉచితాలు కాదు...! అవకాశాలు కావాలి

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల గొప్పతనాన్ని ఎలా కొలవాలి? ఎన్నికల సమయంలో ఎన్ని హామీలు ఇచ్చాయో చూసి కొలవాలా? అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేశాయో చూసి కొలవాలా? లేక ప్రజలు ఎంత గౌరవంగా, ఎంత స్వతంత్రంగా జీవిస్తున్నారు అన్న దానితో కొలవాలా? ఈ ప్రశ్న నేటి భారత రాజకీయాల ముందున్న అత్యంత ముఖ్యమైన ప్రశ్న. ఎందుకంటే దేశ రాజకీయ వ్యవస్థ క్రమంగా ఒక ప్రమాదకర దిశగా సాగుతోందనే భావన సమాజంలో పెరుగుతోంది. ప్రజాస్వామ్యం అంటే ప్రజల సాధికారత కావాలి. కానీ ఇప్పుడు అది అనేక ప్రాంతాల్లో ప్రజల ఆధారపడే సంస్కృతిగా మారుతోందనే విమర్శ వినిపిస్తోంది. ఈ పరిస్థితిని అర్థం చేసుకోవాలంటే భారతీయ పురాణాల్లోని ఒక మహత్తర కథను గుర్తు చేసుకోవాలి — ధర్మరాజు, శ్రీకృష్ణుడు, బలిచక్రవర్తి కథను.

ధర్మరాజు రాజసూయ యాగం చేసిన తర్వాత అపారమైన దానధర్మాలు చేశాడు. బంగారం పంచాడు. భూములు ఇచ్చాడు. అన్నదానాలు చేశాడు. ప్రజలు అతన్ని మహాధర్మాత్ముడిగా కీర్తించారు. రాజ్యం మొత్తం ప్రశంసలతో మార్మోగింది. కానీ ఆ సమయంలో కూడా శ్రీకృష్ణుడు మాత్రం ఒక లోతైన సత్యాన్ని గమనించాడు. ప్రజలు రాజును పొగుడుతున్నారు, కానీ వాళ్లు ఇంకా యాచించే స్థితిలోనే ఉన్నారు. అంటే రాజ్యం ఇంకా ప్రజలను స్వావలంబులుగా మార్చలేకపోయిందన్న మాట. అప్పుడు కృష్ణుడు ధర్మరాజును బలిచక్రవర్తి వద్దకు తీసుకెళ్లాడని పురాణ కథ చెబుతుంది. అక్కడ బలిచక్రవర్తి చెప్పిన మాట నేటి రాజకీయ వ్యవస్థ మొత్తాన్ని ప్రశ్నించే శక్తి కలిగివుంది — "నా రాజ్యంలో యాచకులు లేరు. ప్రజలు అడగాల్సిన పరిస్థితి రాకుండా చేయడమే నిజమైన రాజధర్మం."

ఈ ఒక్క వాక్యం నేటి భారత రాజకీయాలకు అద్దం లాంటిది. ఎందుకంటే ఇప్పుడు రాజకీయాలు క్రమంగా సంక్షేమ పోటీలుగా మారుతున్నాయి. ఎన్నికల సమయంలో ప్రతి పార్టీ వందలాది హామీలు ఇస్తోంది. ఉచిత విద్యుత్, ఉచిత ప్రయాణం, నగదు పథకాలు, నిరుద్యోగ భృతి, స్కూటీలు, బంగారం, రుణమాఫీలు, ఉచిత వస్తువులు, ఇవన్నీ ఎన్నికల ప్రధాన ఆయుధాలుగా మారిపోయాయి. ప్రజల బాధలను నిజంగా తొలగించాలనే ఆలోచన కంటే, వాళ్ల తక్షణ అవసరాలను రాజకీయంగా ఉపయోగించుకోవాలనే ధోరణి పెరుగుతోందనే విమర్శ బలపడుతోంది. తెలంగాణలో "ఆరు గ్యారంటీలు", "వందల హామీలు" వంటి రాజకీయ వాగ్దానాలు ప్రజల్లో ఆశలు పెంచాయి. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో కూడా సంక్షేమ రాజకీయాలు విస్తరించాయి. ఎన్నికల సమయంలో ప్రజల కష్టాలు గుర్తుకొస్తాయి. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందని చెప్పే పరిస్థితి వస్తుంది. ఇది కేవలం ఒక రాష్ట్ర సమస్య కాదు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న రాజకీయ ధోరణి.

ఇక్కడ అసలు ప్రశ్న ఏమిటంటే, ప్రజలకు తాత్కాలిక ఉపశమనం కావాలా? లేక జీవితాన్ని మార్చే శాశ్వత అవకాశాలా? ఒక కుటుంబానికి నెలకు కొంత డబ్బు ఇవ్వడం కొంతకాలం ఉపశమనం ఇవ్వొచ్చు. కానీ ఆ కుటుంబంలోని పిల్లవాడికి నాణ్యమైన విద్య లేకపోతే అతని భవిష్యత్తు మారదు. ఒక రైతుకు ఒకసారి రుణమాఫీ చేసినా, గిట్టుబాటు ధర లేకపోతే అతని జీవితం మళ్లీ అప్పుల్లో పడుతుంది. ఒక నిరుద్యోగ యువకుడికి భృతి ఇచ్చినా, ఉద్యోగాలు లేకపోతే అతని ఆత్మగౌరవం తిరిగి రాదు. అంటే సమస్య యొక్క మూలాన్ని పరిష్కరించకుండా పైపైన ఉపశమనాలు ఇస్తే సమాజం బలపడదు.

ఇక్కడే బలిచక్రవర్తి తత్వం గొప్పదనాన్ని పొందుతుంది. ఆయన దానం వ్యతిరేకి కాదు. కానీ ప్రజలు యాచించే పరిస్థితి రావడం ఒక రాజ్య వైఫల్యమని చెప్పాడు. నేటి రాజకీయాల్లో ఈ ఆలోచన కనిపించడం చాలా అరుదు. ఇప్పుడు ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే దానికంటే, ఎన్నికల వరకు నియంత్రించాలనే రాజకీయ ధోరణి పెరుగుతోంది. సంక్షేమం అవసరం లేదు అనడం వాస్తవానికి దూరం. భారతదేశం వంటి సామాజిక అసమానతలు ఉన్న దేశంలో ప్రభుత్వ సహాయం తప్పనిసరి. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాలు, వికలాంగులు, వృద్ధులు, మహిళలు — వీరికి ప్రభుత్వ మద్దతు అవసరం. ఆకలి, పేదరికం, నిరుద్యోగం ఉన్న సమాజంలో సంక్షేమం ఒక రక్షణ కవచం. కానీ అదే సంక్షేమం ప్రజలను రాజకీయంగా ఆధారపడేలా చేస్తే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదంగా మారుతుంది.

ఇప్పుడు దేశంలో అత్యంత ఆందోళన కలిగించే విషయం ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటం. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు సామాన్య ప్రజల ఆశల కేంద్రాలు. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ధనికులు కార్పొరేట్ విద్యాసంస్థలకు వెళ్తున్నారు. మధ్యతరగతి అప్పులు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలను చదివిస్తోంది. పేదలు మాత్రం బలహీనమైన ప్రభుత్వ విద్యతోనే పరిమితమవుతున్నారు. ఇది కేవలం విద్య సమస్య కాదు. ఇది భవిష్యత్తు అసమానతకు మూలం. ఒక పేద పిల్లవాడికి కూడా ప్రపంచ స్థాయి విద్య అందకపోతే సామాజిక న్యాయం గురించి మాట్లాడటం అర్థరహితం. నిజమైన సంక్షేమం అంటే పేదరికాన్ని తరతరాలుగా కొనసాగకుండా చేసే వ్యవస్థ. ప్రతి గ్రామంలో నాణ్యమైన ప్రభుత్వ పాఠశాల ఉండాలి. మంచి ఉపాధ్యాయులు ఉండాలి. డిజిటల్ విద్య అందుబాటులో ఉండాలి. పేద పిల్లవాడు కూడా డాక్టర్, శాస్త్రవేత్త, పరిపాలకుడు అయ్యే స్థాయికి చేరుకోవాలి. అదే నిజమైన సామాజిక న్యాయం.

వైద్య రంగంలో పరిస్థితి ఇంకా భయంకరంగా మారుతోంది. నేటి భారతదేశంలో ఒక కుటుంబం అత్యంత భయపడేది అనారోగ్యాన్ని. ఎందుకంటే వైద్య ఖర్చులు సామాన్యుడి జీవితాన్ని అప్పుల బారిన పడేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేక ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ లక్షల రూపాయల బిల్లులు చెల్లించలేక కుటుంబాలు ఆర్థికంగా కూలిపోతున్నాయి. ఒక పేద కుటుంబానికి ఆరోగ్య భీమా కార్డు ఇవ్వడం మంచిదే. కానీ అంతకంటే గొప్పది ప్రభుత్వ ఆసుపత్రులనే కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లడం. ప్రతి జిల్లాలో ప్రపంచ స్థాయి వైద్యం అందుబాటులో ఉంటే ప్రజలు ఎందుకు అప్పులు చేసి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తారు? ప్రజలను బలపరచేది కార్డులు కాదు. బలమైన ప్రజా ఆరోగ్య వ్యవస్థ.వ్యవసాయం పరిస్థితి కూడా ఇదే ప్రశ్నను లేవనెత్తుతోంది. రైతు ఇప్పటికీ అనిశ్చితిలోనే బతుకుతున్నాడు. వర్షం వస్తుందో లేదో తెలియదు. పంటకు ధర ఉంటుందో లేదో తెలియదు. రుణాలు పెరుగుతున్నాయి. మధ్యవర్తుల దోపిడీ కొనసాగుతోంది. ప్రతి ఎన్నికలో రైతు రుణమాఫీ ప్రధాన హామీగా మారుతోంది. కానీ రైతుకు నిజంగా కావాల్సింది రుణమాఫీ కాదు. గిట్టుబాటు ధర, నీటి భద్రత, నిల్వ సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, న్యాయమైన వ్యవసాయ విధానం. రైతు చేతిలో జోలె కాకుండా మార్కెట్ శక్తి ఉండాలి. ఒక రైతు తన పంటకు గౌరవప్రదమైన ఆదాయం పొందితే అతను ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సిన అవసరం ఉండదు.

దేశ యువత పరిస్థితి కూడా ఇదే ఆందోళనను పెంచుతోంది. చదువుకున్న యువకులు సంవత్సరాల పాటు ఉద్యోగ పరీక్షల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు విదేశాలకు వెళ్తున్నారు. మరికొందరు నిరాశలో పడుతున్నారు. కొన్ని ప్రభుత్వాలు నిరుద్యోగ భృతి ఇస్తామంటున్నాయి. కానీ యువతకు నిజంగా కావాల్సింది భృతి కాదు. గౌరవప్రదమైన ఉద్యోగం. ప్రపంచ స్థాయి నైపుణ్య శిక్షణ. పరిశ్రమలు. సృజనాత్మక అవకాశాలు. ఒక యువకుడు తన ప్రతిభతో ఎదగగలిగితే అతనికి రాజకీయ నాయకుడి చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు.ఇంకా ఒక ప్రమాదకరమైన విషయం దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానత. ఒకవైపు కొద్దిమంది వ్యాపారవేత్తలు లక్షల కోట్ల సంపద కూడబెట్టుకుంటున్నారు. మరోవైపు సామాన్య ప్రజలు రుణాలు, నిరుద్యోగం, వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద సంస్థలు వేల కోట్ల రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకపోయినా ప్రత్యేక సౌకర్యాలు పొందుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ చిన్న రైతు లేదా చిన్న వ్యాపారి కొద్దిపాటి రుణం చెల్లించలేకపోతే కఠిన చర్యలు ఎదుర్కొంటున్నారు. ఇది కేవలం ఆర్థిక అసమానత కాదు. ఇది ప్రజాస్వామ్య సమానత్వానికి సవాలు.ఇలాంటి పరిస్థితుల్లో వ్యక్తి ఆరాధన రాజకీయాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రజాస్వామ్యంలో నాయకులు ప్రజల సేవకులు కావాలి. కానీ ఇప్పుడు నాయకులను దేవుళ్లలా చూపించే సంస్కృతి పెరుగుతోంది. నాయకుడిని ప్రశ్నిస్తే అది పార్టీ వ్యతిరేకతగా మారుతోంది. ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం కాదు. ప్రజలు నాయకులను గౌరవించవచ్చు. కానీ ప్రశ్నించే హక్కును కోల్పోవద్దు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై సమాధానం అడగడం ప్రజల హక్కు. "ఎన్ని పథకాలు ఇచ్చారు?" అనే ప్రశ్నతో పాటు "ఎన్ని పాఠశాలలు నిర్మించారు?", "ఎన్ని ఆసుపత్రులు బలపరిచారు?", "ఎన్ని ఉద్యోగాలు కల్పించారు?" అనే ప్రశ్నలు రావాలి.

ఒక సమాజం బలపడాలంటే మూడు అంశాలు అత్యంత కీలకం, నాణ్యమైన విద్య, అందుబాటులో ఉన్న వైద్యం, గౌరవప్రదమైన ఉపాధి. ఈ మూడు ఉంటేనే ప్రజలు నిజమైన స్వేచ్ఛను అనుభవిస్తారు. లేదంటే సంక్షేమ పథకాల మీద ఆధారపడే సమాజంగా మారిపోతారు. బలిచక్రవర్తి తత్వం నేటి ప్రభుత్వాలకు చెబుతున్న అసలు సందేశం ఇదే. ప్రజలకు తాత్కాలిక ఉపశమనం ఇవ్వడం మాత్రమే కాదు, వాళ్లు భవిష్యత్తులో ప్రభుత్వాల ముందు చేతులు చాచకుండా నిలబడే శక్తిని ఇవ్వాలి.

ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వరం. ఆ ఓటును కేవలం తాత్కాలిక లాభాల కోసం ఉపయోగిస్తే భవిష్యత్తు బలహీనమవుతుంది. ప్రజలు కూడా మారాలి. నాయకులపై అంధభక్తి కాకుండా బాధ్యతాయుతమైన ప్రశ్నలు వేయాలి. "ఎంత ఇచ్చారు?" అనే ప్రశ్నతో పాటు "ఎంత నిర్మించారు?" అనే ప్రశ్న రావాలి. ఎందుకంటే ఒక దేశం బలపడేది ఉచితాల వల్ల కాదు. అవకాశాల వల్ల.

చివరికి బలిచక్రవర్తి కథ మనకు చెబుతున్న మహత్తర సత్యం ఒక్కటే — రాజ్యం గొప్పదనాన్ని దానాల సంఖ్యతో కొలవకూడదు. ప్రజలు ఎంత గౌరవంగా, ఎంత స్వతంత్రంగా... ఆత్మగౌరవంగా జీవిస్తున్నారు అన్నదే అసలు ప్రమాణం. ప్రజల చేతిలో జోలె కాకుండా భవిష్యత్తును పెట్టే రాజకీయాలే దేశాన్ని ముందుకు తీసుకెళ్తాయి. అదే నిజమైన రాజధర్మం అని పాలకులు గుర్తు ఎరగాలి.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

# యువతకు మార్గదర్శి కష్టపడితే కలలు నిజమవుతాయని నిరూపించిన ఐఏఎస్ సి.నారాయణరెడ్డి



తెలంగాణ కేడర్‌కు చెందిన 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సి. నారాయణరెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ప్రజాదరణ, పారదర్శక పరిపాలన, ప్రజల సమస్యల పరిష్కారంలో చూపుతున్న చొరవకు గుర్తింపుగా "ఫేమ్ ఇండియా - ఆసియా పోస్ట్ సర్వే 2026" నిర్వహించిన అధ్యయనంలో దేశంలోని టాప్ 100 జిల్లా కలెక్టర్ల జాబితాలో ఆయనకు స్థానం లభించింది. ఈ గుర్తింపు ఆయన సేవా తత్వానికి, నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.

మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలంలోని శ్రీపురం అనే చిన్న గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన సి. నారాయణరెడ్డి జీవితం ఎంతో ప్రేరణాత్మకం. తల్లిదండ్రులు చెన్నారెడ్డి, నర్సింగమ్మలకు ఆరో సంతానంగా జన్మించిన ఆయన చిన్నప్పటి నుంచే కష్టాలను ఎదుర్కొన్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండగా, ఏడో తరగతి చదువుతున్న సమయంలో తండ్రి మరణించడం ఆయన జీవితంలో పెద్ద మలుపు తీసుకొచ్చింది. చదువు మానేసి పొలం పనులకు వెళ్లాలనుకున్న సమయంలో అన్నలు అండగా నిలిచి చదువు కొనసాగించమని ప్రోత్సహించారు.

పేదరికం మధ్య చదువును కొనసాగించిన నారాయణరెడ్డి ఖాళీ సమయాల్లో వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి తోడ్పడ్డారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించడంతో కళాశాల యాజమాన్యం ఉచిత విద్య అందించింది. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఈడీ, ఎంఎస్సీ (గణితం) పూర్తి చేసి ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేశారు.

జీవితంలో ఎన్నో అవమానాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఆయన వెనుదిరగలేదు. పెట్రోల్ బంక్‌లో పని చేయడం నుంచి పెయింటింగ్ పనులు చేయడం వరకు ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నారు. 2006 డీఎస్సీలో మహబూబ్‌నగర్ జిల్లా టాపర్‌గా నిలిచిన ఆయన కొంతకాలం ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నెలకు రూ.2000 జీతంతో పనిచేశారు. ఆ సమయంలో చాలామంది ఎగతాళి చేసినా, ఆయన తన లక్ష్యాన్ని మాత్రం విడిచిపెట్టలేదు. "కలెక్టర్ కావాలి" అనే సంకల్పంతో నిరంతరం శ్రమించిన నారాయణరెడ్డి 2009 గ్రూప్ 1 పరీక్షలో తొలి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయి టాప్ ర్యాంక్ సాధించారు. అనంతరం ఆర్డీఓగా గజ్వేల్, పెద్దపల్లి, సూర్యాపేట ప్రాంతాల్లో సేవలందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నల్లగొండ కలెక్టర్‌గా పనిచేసి, తరువాత ములుగు, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్‌గా ప్రజల మనసులు గెలుచుకున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ప్రజలకు సేవలందిస్తున్నారు.

తాను పనిచేసే ప్రతి ప్రాంతంలో ప్రజలతో మమేకమై, సమస్యలను వేగంగా పరిష్కరించే అధికారిగా సి. నారాయణరెడ్డి ప్రత్యేక గుర్తింపు పొందారు. కార్యాలయానికి వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంగా ఆహ్వానించి, ఓపికగా వారి సమస్యలు విని వెంటనే పరిష్కార మార్గం చూపే మానవతా దృక్పథం ఆయనను ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానంలో నిలబెట్టింది. నేటి యువతకు సి. నారాయణరెడ్డి జీవితం గొప్ప స్ఫూర్తి. పేదరికం, కష్టాలు, అవమానాలు విజయానికి అడ్డుకావని ఆయన నిరూపించారు. లక్ష్యంపై దృష్టి, కష్టపడే తత్వం, చదువుపై నిబద్ధత ఉంటే సాధారణ రైతు కుటుంబం నుంచి కూడా దేశంలో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని ఆయన జీవితం చెబుతోంది. సౌకర్యాల మధ్య కూడా లక్ష్యాలను కోల్పోతున్న యువత ఆయన ప్రయాణాన్ని ఆదర్శంగా తీసుకొని కృషి చేస్తే విజయాలు తప్పక సాధించగలరు. ఈ సందేశం నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచి ఆదర్శంగా ఉన్నత స్థాయి చేరుకుంటారనే ఆశాభావంతోనే ఈ యొక్క ఆర్టికల్ వ్రాస్తున్నాను. నాకు కలెక్టర్ గారితో వ్యక్తిగతంగా పరిచయం లేదు, వారితో నేను ఏ విధమైన లబ్ధి కూడా పొందలేదు.మాది యాదాద్రి భువనగిరి జిల్లా మా జిల్లాలో తన సేవలు కూడా కొనసాగించలేదు. సమాజానికి ఉపయోగపడే అంశం కాబట్టి ఒక బాధ్యతగల పౌరుడిగా అందిస్తున్న సందేశంగా మాత్రమే చూడాలి.



గుండమల్ల సతీష్ కుమార్.
సంస్థాన్ నారాయణపురం.
94931 55522.

## “ఉనికి కోసం పర్యటనలు... ప్రజా సమస్యలపై పూర్తి నిర్లక్ష్యం”

- **ఎమ్మెల్యే వ్యవహార శైలిపై కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి ఆగ్రహం...**



కూకట్ పల్లి మే 21 వెలుతురు:

కూకట్ పల్లి నియోజకవర్గంలో 90 శాతం అభివృద్ధి పూర్తైందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న ప్రకటనలు అవాస్తవమని కాంగ్రెస్ నాయకుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ ఏబ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి విమర్శించారు. గురువారం ఓ ప్రకటనలో యుగేందర్ రెడ్డి మాట్లాడుతూ చెరబండ రాజు నగర్ శ్మశానవాటికలో ఇప్పటికీ సరైన అభివృద్ధి పనులు జరగకపోవడం ఎమ్మెల్యే మాటలకు నిదర్శనమని అన్నారు. ప్రతిరోజూ మైకులు పట్టుకుని అభివృద్ధి గురించి గొప్పలు చెప్పుకునే ఎమ్మెల్యే, ప్రజలకు అత్యవసరమైన మౌలిక వసతులపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. శ్మశానవాటిక సమస్యలపై స్పందించకుండా, బీఆర్ఎస్ నాయకులు రాజకీయ వ్యాఖ్యలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల్లో తన ఉనికిని కాపాడుకోవడానికే ఎమ్మెల్యే తరచూ పర్యటనలు నిర్వహిస్తున్నారని, అభివృద్ధి పూర్తయిందని చెబుతూ మళ్లీ అధికారులను వెంటబెట్టుకుని తిరగడం విరుద్ధ ధోరణిగా ఉందని విమర్శించారు. పర్యటనల పేరుతో అధికారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఇది ఆరోగ్యకరమైన పరిపాలనా విధానం కాదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వ్యవహార శైలిపై అధికార యంత్రాంగం ఇప్పటికే అసంతృప్తితో ఉందని, “నివురుగప్పిన నిప్పులా” పరిస్థితి నెలకొందని యుగంధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం త్వరలోనే అధికారులు తిరుగుబాటు స్వరాన్ని వినిపించే పరిస్థితులు ఏర్పడవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులతో కూకట్పల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టకుండా ప్రచార రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.

## చింతపల్లిగూడ గ్రామంలో ఆలయం కూల్చివేతపై విచారణ చేపట్టిన పోలీస్ అధికారులు



ఇబ్రహీంపట్నం వెలుతురు మే 21:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగర కాలన్ డివిజన్ ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని కొంగర కలన్ 54వ డివిజన్ చింతపల్లిగూడ గ్రామంలో పురాతన శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని అక్రమంగా కూ ల్చివేశారని ఆరోపిస్తూ గ్రామస్థులు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఇబ్రహీంపట్నంగారికి మరియు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇబ్రహీంపట్నం గార్లకు ఫిర్యాదు చేయడం జరిగింది ఈరోజ గ్రామ స్థులు తెలిపిన వివరాల ప్రకారం జీహెచ్ఎంసీ ఆదిభట్ల సర్కిల్ 54వకొంగర కలాన్ డివిజన్ పరిధిలోని చింతపల్లిగూడ గ్రామరెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 9,10,11,12లో గాజులబోడు ప్రాంతంలో సుమారు 100సంవత్సరాలపై చరిత్ర కలిగిన శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ఉండేదని పేర్కొన్నారు గ్రా మ ప్రజలు ఈ ఆలయాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తూ వస్తున్నారని తెలిపారు అయితే ఇటీవల ఆప్రాంతంలో ప్రగతి టౌన్ షిప్ పేరుతో వెంచర్ ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఆలయాన్ని కూల్చివేశారని గ్రామస్థులు ఆరోపించారు తమ ఆరాధ్య దైవంగా భావించే దేవాలయాన్ని తొల గిం చడంవల్ల గ్రామప్రజల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేయడంతో ఈ మే రకు పోలీస్ స్టేషన్ లో అందజేసిన ఫిర్యాదులో సంబంధిత అధికారులు వెంటనే సంఘటన స్థ లానికి చేరుకునివివరాలు మరియు విచారణ చేపట్టిన మ హేందర్ రెడ్డి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇబ్రహీంపట్నం గారు మరియు సూర్య తేజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఇబ్రహీంపట్నంగారితో కలిసి వి చారణ చేపట్టారు ఈకార్యక్రమంలో దళిత చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఉక్కుల అశోక్ ఇందిర మ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్ నాయకులు ఉడుతల రవి గౌడ్ కొండ్రు రాములు జోగు బాల య్య జోగునర్సింహ శేరి జంగయ్యజోగు భిక్షపతి జోగు బాలయ్య జోగు ఇబ్రహీం జోగు పెంటయ్య జోగు మ హేందర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## నేడు నిర్వహించే ప్రజాపాలన జిల్లాస్థాయి కార్యక్రమాన్ని విజయ వంతంచేయాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి**



ఇబ్రహీంపట్నం వెలుతురు మే 21:

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగాచేపట్టిన ప్రజాపాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న శుక్రవారంనిర్వహించనున్న జిల్లాస్థాయి కార్యక్ర మం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ కిరణ్మయి గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లాస్థాయి కార్యక్ర మాన్ని విజయవంతంగా నిర్వహిం చేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు గ్రామ మండల నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని అదే స్ఫూ ర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ఫోటోలు ఆయాపథకాల ద్వా రా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వి వరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు జిల్లా అభివృద్ధికార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు సా ధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉండాలన్నారు ఆయా శాఖల ఆధ్వర్యం లో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు ప్రజా ప్రతి నిధులను ఆహ్వానించాలని శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు

# “ఆధునిక భారత నిర్మాణ శిల్పి రాజీవ్ గాంధీ”

- **కేపీహెచ్‌బీ రాజీవ్ సర్కిల్‌లో ఘన నివాళులు అర్పించిన డా. సత్యం శ్రీరంగం**



కూకట్ పల్లి, మే 21 వెలుతురు:

భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగంలోకి తీసుకెళ్లిన దార్శనిక నాయకుడు, భారతరత్న మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ అని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కొనియాడారు. రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీలోని రాజీవ్ సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ.. నవభారత నిర్మాణానికి సాంకేతికతే పునాది అని విశ్వసించిన విజనరీ నాయకుడు రాజీవ్ గాంధీ అని పేర్కొన్నారు. దేశంలో ఐటీ విప్లవానికి బాటలు వేసి, టెలికమ్యూనికేషన్ రంగంలో సంచలనాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. విద్య, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక ప్రగతి వంటి రంగాల్లో రాజీవ్ గాంధీ తీసుకున్న నిర్ణయాలే నేటి భారత అభివృద్ధికి మూల స్తంభాలని వివరించారు.

యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అందించడం, గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేయడం వంటి ఎన్నో చారిత్రాత్మక సంస్కరణలు రాజీవ్ గాంధీ పాలనలోనే అమలయ్యాయని గుర్తుచేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి దేశ రాజకీయ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి దేశాన్ని సంక్షోభంలోకి నెడుతోందని విమర్శించిన డా. సత్యం శ్రీరంగం, రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ద్వారా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వం ప్రజల తీర్పుతో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పొరేటర్లు గోపిశెట్టి రాఘవేందర్, గంధం రాజు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, సతీష్ గౌడ్, కృష్ణ రాజ్‌పుత్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, ఫణీంద్ర, బిబ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, మహిళా నాయకులు రజిత, మారుతి, వనజ, పొడుగు అప్పారావు, కనకయ్య, నితీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

- **రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం పని చేయాలి**
- **కాంగ్రెస్ పార్టీ ఆరుట్ల గ్రామశాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం**

మంచాల వెలుతురు మే 21:



మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో స్వర్గీయ భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సంద ర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నూకం బాలరాజ్ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీ శైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసిని వాళులర్పించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీ వ్ గాంధీ పేద ప్రజలకు కోసం ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి దేశ ప్రజల గుండెలో చిరస్థాయిగా నిలి చిన గొప్ప ప్రధాని రాజీవ్ గాంధీ అన్నారు ప్రతి కాంగ్రెస్ పార్టీ నాయకుడు కార్యకర్త రాజీవ్ గాం ధీ ఆశయ సాధన కోసం కృషి చేయాలనిఅన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచాల మండ లం కిసాన్ సెల్ అధ్యక్షుడు కావాలి బుగ్గరాములు ముదిరాజ్ మాజీ ఎంపీటీసీ కావాలి బుగ్గ రా ములు ముదిరాజ్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు అనంగళ్ళ జగన్నాథం ఆరుట్ల గ్రామయూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బుడిగల పరమేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణముదిరాజ్ కంబాల పల్లి బుగ్గ రాములు మారలక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల భాష పంబాల బుగ్గ రాములు గుడ్డిమల్ల చంద్రయ్య ముదిరాజ్ దాసరమోనిరమేష్ ముదిరాజ్ కావాలి శ్రీనివాస్ ముది రాజ్ (హోటల్) అంతటి రాజు గౌడ్ మర సురేష్ మహమ్మద్ అష్రఫ్ తవిటి బుగ్గ రాములు ముదిరా జ్ తదితరులు పాల్గొన్నారు

## “పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న కేంద్రం...”



- **కేంద్ర ప్రభుత్వ విధానాలపై గాంధీ భవన్‌లో డా. సత్యం శ్రీరంగం తీవ్ర విమర్శలు**

కూకట్ పల్లి మే 21వెలుతురు:

ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం మోపిందని పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మండిపడ్డారు.గురువారం గాంధీ భవన్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అధికంగా ఉన్నప్పటికీ ప్రజలపై అదనపు భారాలు వేయలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు, సెస్సుల పేరుతో ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని ఆరోపించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలో ప్రధాని నరేంద్ర మోడీ “డబుల్ ఇంజిన్ సర్కార్” పేరుతో అభివృద్ధి కథనాలను విస్తృతంగా ప్రచారం చేశారని, దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారని అన్నారు. కానీ ఎన్నికలు పూర్తికాగానే ప్రజలపై పెట్రోల్, డీజిల్ ధరల రూపంలో భారాలు మోపడం కేంద్ర ప్రభుత్వ అసలు వైఖరిని బయటపెడుతోందని విమర్శించారు. దేశం ఆర్థిక సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో ప్రజలకు పొదుపు, ఖర్చుల నియంత్రణపై ఉపన్యాసాలు ఇస్తున్న ప్రధాని మోడీ, తన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని డా. సత్యం శ్రీరంగం ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన బాధ్యతను విస్మరించి, ఆ భారాన్ని సామాన్య ప్రజల భుజాలపై మోపుతున్నారని అన్నారు. రూపాయి విలువ రోజురోజుకు పడిపోతూ డాలర్‌తో పోలిస్తే చరిత్రాత్మక కనిష్ట స్థాయికి చేరుతోందని పేర్కొన్న ఆయన, ఇలాంటి పరిస్థితుల్లో దేశం ప్రపంచ ఆర్థిక రంగంలో అగ్రగామిగా ఎలా ఎదుగుతుందని ప్రశ్నించారు. “500 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ” అంటూ విదేశాల్లో గొప్పలు చెప్పుకోవడం తప్ప, దేశ ప్రజల అసలు సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కట్టబెడుతూ, సామాన్య ప్రజలపై పన్నులు, ఇంధన ధరల రూపంలో భారాలు మోపడం బీజేపీ ప్రభుత్వ విధానంగా మారిందని ఆరోపించారు. ప్రజల సహనాన్ని పరీక్షించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## నోముల గ్రామంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



- **స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివి**
- **మంచాల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి**

మంచాల వెలుతురు మే 21:

మంచాల మండలం నోముల గ్రామంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా
నోముల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పల్నాటి రవి ఆధ్వర్యం లో రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంచాల మండ లం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్మ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వర్గీయ భారత మాజీ ప్రధాని రా జీవ్ గాంధీ దేశ ప్రజల కోసం ఎన్నోసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి కాంగ్రెస్ పార్టీకి మంచి పేరు తేవ డ మే కాకుండా దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ అని అన్నారు రాజీవ్ గాంధీ చేసిన సేవలు దేశ ప్రజలు మరువలేనివి అని అన్నారు ఈకా ర్యక్రమం లో మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు గుండెమోనిమల్లేష్ ముదిరాజ్ మంచాల సహకార సంఘం డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి నోముల మాజీ సర్పంచ్ ముత్యమయ్య మాజీ ఎంపీటీసీ పల్నాటి జయానందం మాజీ సర్పంచ్ మల్లేష్ వార్డ్ మెం బర్ పల్నాటి జంగయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్నాటి యాదయ్య పాశం వెంకటేష్ గౌడ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు గంట కృష్ణ ముదిరాజ్ ఎండి రియాజ్ గ్రామ కమిటీ ఉపాధ్యక్షులు పల్నాటి భాస్కర్ యూత్ అధ్యక్షులు మాదరమోని హరీష్ యూత్ ఉపాధ్యక్షులు ఐత రాజు రాజు నాయకులు రాజేష్ భరత్ మంచాల మండలం వివిధ గ్రామాల నాయకులు చిత్తాపురం నాయకు లు తాళ్లపల్లిగూడా శేఖర్ చిత్తాపురం మల్లేష్ నోముల మంగళవారం శ్రీనివాస్ గంట సురేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# తువ్వాలో జీవన గాథ.. ఊర్కొండ లో "తువ్వాల పాట" పోస్టర్ విడుదల..

ఊర్కొండ, వెలుతురు మే 21:

మనిషి పుట్టుక నుంచి మరణం వరకు ప్రతి దశలోనూ తోడుగా నిలిచే తువ్వాల ప్రాధాన్యతను హృద్యంగా ప్రతిబింబిస్తూ కవి, రచయిత రామ్ పెరుమాండ్ల రచించిన "తువ్వాల పాట" పోస్టర్‌ను ఊర్కొండ మండల కేంద్రంలో ఘనంగా విడుదల చేశారు. గ్రామీణ జీవనశైలి, సంప్రదాయాలు, అనుబంధాలను గుర్తు చేసేలా రూపొందిన ఈ పాట స్థానికంగా ఆకట్టుకుంటోంది.



ఈ పాటకు మాధారం గ్రామ సర్పంచ్ చిక్కొండ్ర మల్లేశ్ నిర్మాతగా వ్యవహరించగా, కేషమళ్ల అనిల్ గానం అందించారు. సురేష్ ఎల్లికంటి, నరేష్ నాయక్ వాడిత్యవత్ కొరస్‌గా పాటలో పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల కార్యక్రమంలో ఊర్కొండ గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ పోలే రాజు, మాధారం సర్పంచ్ చిక్కొండ్ర మల్లేశ్, సంతోష్, సందీప్‌తో పాటు పీ కే మెలోడీస్ యూట్యూబ్ ఛానెల్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ సంస్కృతి సువాసనతో రూపొందిన ఈ పాటను ప్రజలు తప్పక ఆదరించాలని కోరారు. పాట విడుదల కావడంతో మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

# నీర్నెములలో అధికారుల ఏకపక్ష ధోరణి నడవదు

- **చట్టప్రకారం పాలన సాగాల్సిందే!**

రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21:



నిబంధనలు ఉల్లంఘిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు.. హైకోర్టులో పిల్ (PIL) వేస్తాం: హనుమాన్ యూత్ హెచ్చరిక గ్రామ పంచాయతీల్లో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని నీర్నెముల గ్రామ "హనుమాన్ యూత్ అసోసియేషన్" సభ్యులు మరియు గ్రామ బాధ్యతాయుత పౌరులు స్థానిక అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018 ప్రకారం గ్రామ సభల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం అమలు చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి అధికారికంగా వినతి పత్రం (రిసీవ్డ్ కాపీ నెం: హెచ్ వై ఎ / సి ఎస్ ఎఫ్ /జిపి /2026/05/01) అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.* చట్ట ప్రకారం ప్రతి మూడు నెలలకు ఒకసారి గ్రామ సభ నిర్వహించడం తప్పనిసరి అయినప్పటికీ, ప్రజా భాగస్వామ్యం కోసం, అభివృద్ధి పనుల వేగవంతం కోసం ప్రతి నెల గ్రామ సభ లేదా ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. సభ జరగడానికి 7 రోజుల ముందే ఊరిలో డప్పు చాటింపు వేసి, నోటీసు బోర్డు ద్వారా ప్రజలందరికీ సమాచారం అందించాలని స్పష్టం చేశారు. అర్హుల ఎంపికలో రాజకీయం చేస్తే ఊరుకోం! ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, దళిత బంధు, రైతు భరోసా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ ప్రమేయం, రికమండేషన్లు నడవడానికి వీల్లేదని వారు తేల్చి చెప్పారు. అర్హులైన లబ్ధిదారులను గ్రామ సభలోనే, ప్రజలందరి సమక్షంలో బహిరంగంగా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల ద్వారా వచ్చే నిధులు, జనరల్ ఫండ్ ఖర్చుల వివరాలను ప్రతి ఆరు నెలలకోసారి 'సోషల్ ఆడిట్' (సామాజిక తనిఖీ) ద్వారా గ్రామ సభలో ప్రజల ముందు ఉంచాలని చట్టాన్ని గుర్తు చేశారు.

వీడియో రికార్డింగ్, డిజిటల్ సాక్ష్యాలు తప్పనిసరి:* గ్రామ సభల్లో పారదర్శకత కోసం ప్రతి సభను వీడియో రికార్డింగ్ చేయాలని, పనుల పురోగతిని తెలుపుతూ 'జియోట్యాగింగ్' మరియు డిజిటల్ ఆడిట్ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని అధికారులను కోరారు. అలాగే, ఏ సేవ ఎన్ని రోజుల్లో అందుతుందో తెలిపే "సిటిజన్ చార్టర్" బోర్డును పంచాయతీ ఆఫీస్ బయట ప్రజలకు కనిపించేలా పెద్ద బోర్డు రూపంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రూల్స్ అతిక్రమిస్తే కోర్టు మెట్లు ఎక్కుతాం!* "తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం2018, జీవో నెంబర్ 114, జీవో నెంబర్ 30 మరియు ఆర్టీఐ సెక్షన్లను ఉల్లంఘించడం శిక్షార్హమైన నేరం. అధికారులు చట్టాన్ని పక్కనబెట్టి ఏకపక్షంగా వ్యవహరిస్తే పౌర హక్కుల ఉల్లంఘన కింద భావిస్తాం. దీనిపై ఉన్నతాధికారులైన ఎంపీడీవో డిపిఓ మరియు జిల్లా కలెక్టర్‌కు సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేయడమే కాకుండా, గౌరవ హైకోర్టులో పిల్ ( పి ఐ ఎల్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ ) దాఖలు చేయడానికి కూడా వెనుకాడం" అని హనుమాన్ యూత్ ప్రతినిధులు హెచ్చరించారు.

ఈ వినతి పత్రంపై తీసుకున్న చర్యల వివరాలను సిటిజన్ చార్టర్ నిబంధనల ప్రకారం 15 రోజుల్లోగా తమ అసోసియేషన్‌కు రాతపూర్వకంగా ( రైట్ ఇన్ రిప్లై) సమాధానం ఇవ్వాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీవ్రం చేస్తామని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు, బాధ్యతాయుత పౌరులు పాల్గొన్నారు.

**ఇట్లు,**
**హనుమాన్ యూత్ అసోసియేషన్,**
**నీర్నెముల.**

## గద్వాల్ విజయలక్ష్మికి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు






- **హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 21:

హైదరాబాద్ మాజీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలంగాణ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా హిమాయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ ఆమెను కలిసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా గద్వాల్ విజయలక్ష్మికి శుభాకాంక్షలు తెలియజేస్తూ నూతన పదవిలో విజయవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి రామన్ గౌడ్, ముజఫర్, వీణ, వినోద్, రాజేంద్ర ప్రసాద్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతిపత్రం



రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21:

బంజర హిల్స్ మంత్రుల నివాసం లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని కలిసిన కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి మరియు విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం సభ్యులు కలిసి దివ్యాంగుల సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం, రవాణా శాఖలో బీసీ సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను నింపి దివ్యాంగులకు అండగా ఉండాలని కోరడం జరిగింది. విద్య మరియు ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వడం, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను త్వరితగతిన అమలు చేయాలని నాయకులు మంత్రిని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.మంత్రి పొన్నం ప్రభాకర్ దివ్యాంగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం , విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎన్ అశోక్ ఉపాధ్యక్షులు డాక్టర్ కుర్సీద్ మియా మారవేణి చంద్రశేఖర్ యాదవ్. సహాయ కార్యదర్శి నాగేష్. చిత్తలూరి వేణు గౌడ్, దూరపల్లి దానమ్మ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ గారిని కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలి





- **కేంద్ర ప్రభుత్వం బీసీలకు సముచిత స్థానం కల్పించాలి.**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్**

హైదరాబాద్ వెలుతురు మే 21:

త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ రాష్ట్రం నుంచి బడుగు బలహీన వర్గాలకు చెందిన ఈటెల రాజేందర్ గారిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు అన్ని రంగాల్లో కేంద్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఈటెల రాజేందర్ గారు కృషి చేశారని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే రాజేందర్ గారికి మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు.

## ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలు



రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21:

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 35 వర్ధంతి సందర్భంగా రామన్నపేట పట్టణ కేంద్రంలో గురువారం నాడు రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి జమీరుద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాల లేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారత దేశంలో మొట్ట మొదటిగా టెక్నాలజీని పరిచయం చేశారని, సమాచార సాంకేతిక పితామహుడిగా పేరు పొందారని అన్నారు. యువత రాజకీయాల్లో రాణించాలని, ఆయన ఆకాంక్షించారు. దేశ భవిష్యత్ కోసం గాంధీ కుటుంబం త్యాగాలు చేసింది అని తెలిపారు.

ఈ కార్యక్రమానికి డిసిసి సెక్రెటరీ కొత్తపెల్లి అబ్రహం కుమార్, డిసిసి కార్యనిర్వాహణ కార్యదర్శి గుండాల నరసింహ, సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గంగుల రాజిరెడ్డి, పున్న జగన్మోహన్, గుత్తా నర్సిరెడ్డి మొహమ్మద్ నాసర్, జెల్లా వెంకటేశం రామిని రమేష్, శంబాల వెంకన్న, ఉపసర్పంచ్ మోటే రమేష్, వార్డు సభ్యులు కొమ్ము శేఖర్, కొమ్ము రామస్వామి, మోటి మహేష్, బండ లింగస్వామి, గొరిగే శేఖర్, మొహమ్మద్ అంజత్, నకిరేకంటి సుదర్శన్, గోదాసు శ్రీమన్నారాయణ, ఎండి అక్రమ్, కేశవదాసు వెంకటేశం, మహమ్మద్ రిజ్వాన్, ఎండి జానీ, గోపగోని సహదేవ, ఈనా లాయతుల్లా బేగ్, సైదాచారి, కొమ్ము రాజు, ఆముద లక్ష్మణ్, ఎర్ర శేఖర్ గౌడ్, బత్తుల నవీన్, బాలగోని గణేష్, వీరమల్ల లింగస్వామి కక్కిరేణి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటి ప్రమాణ స్వీకారోత్సవం



రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21:

మండలం, వెల్లంకి గ్రామంలోని శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవాలయ నూతన కమిటిని ఎండోమెంట్ అధికారి వెంకటలక్ష్మి ఈరోజు ప్రమాణ స్వీకారం చెయిన్చారు. చైర్మన్ గా గంజి నర్సింహా మరియ కమిటి సభ్యులుగా తాటిపాముల స్వామి గౌడ్, కోరబోయిన కవిత, ఎడ్ల సంజీవ రెడ్డి, దేవరకొండ ఉపేందర్ చారి ప్రమాణ స్వీకారం చేసినారు.

ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి , సింగిల్ విండో చైర్మన్ నంద్యాల భిక్షం రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పున్న లక్ష్మి జగన్మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గంగుల రాజిరెడ్డి, వెల్లంకి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిటిపాముల పెద్దలు, మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి సత్తిరెడ్డి, వెల్లంకి కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం

**గుండాల మే 21(వెలుతురు):** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ దేవనబోయిన ఐలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ఉపాధి హామీ పనుల వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కూడా ఇదే విషయాన్ని తల్లిదండ్రులకు వివరించినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంధం చంద్రకళ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించిందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు అందజేస్తోందని చెప్పారు. అదేవిధంగా ఉదయం రాగి జావా, వారానికి మూడు కోడిగుడ్లతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆవుల సాయి ప్రసాద్, ఉపాధ్యాయులు గొడుగు బాలరాజు, కళాసికం ఉపేందర్ రావు, మోకాళ్ల గంగాభవాని, సీఆర్పీ దేవనబోయిన లింగయ్య, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, వార్డు సభ్యులు మైస రమేష్, పండుగ ఉపేందర్, అంగన్‌వాడీ టీచర్లు రొయ్యల సునీత, అన్నెపర్తి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై బీజేపీ ఆందోళన





- చౌటుప్పల్ మార్కెట్ యార్డులో ధర్నా నిర్వహించిన బీజేపీ శ్రేణులు
- 40 రోజులు గడిచినా 30 శాతం తూకాలు కూడా పూర్తి కాలేదని ఆగ్రహం
- రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శ
- వర్షా కాలానికి ముందే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్
- తూకాల్లో అదనంగా రెండు కిలోలు వేస్తున్నారని ఆరోపణ
- రైతుల సమస్యలపై ఆర్డీవోకు వినతిపత్రం సమర్పణ
- ఐకేపీ కేంద్రాల్లో అవ్యవస్థలపై మండిపడ్డ నేతలు
- రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం

**చౌటుప్పల్ వెలుతురు మే 21:** చౌటుప్పల్ మున్సిపల్, రూరల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మార్కెట్ యార్డులు, గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆరోపిస్తూ బీజేపీ శ్రేణులు ధర్నా చేపట్టడంతో పాటు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షురాలు కదారి కల్పన మాట్లాడుతూ.. రైతులు ఎంతో కష్టపడి పండించిన వరి పంట కోసి 40 రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు 30 శాతం తూకాలు కూడా పూర్తి కాలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితమైందని, రైతులను మాయమాటలు చెప్పి వారి పబ్బం గడుపుకుంటోందని విమర్శించారు. రైతులకు ఉపయోగపడే చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దూడల భిక్షం గౌడ్ మాట్లాడుతూ.. మరో 15 రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాలు కురిస్తే రైతులు తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తూకాల్లో కూడా రైతులకు అన్యాయం జరుగుతోందని బీజేపీ నేతలు ఆరోపించారు. 40 కిలోల 100 గ్రాముల బదులు అదనంగా మరో రెండు కిలోలు ఎక్కువగా తూకం వేస్తున్నారని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై రైతుల పక్షాన బీజేపీ ధర్నా నిర్వహించి అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు కైరంకొండ అశోక్, రమణగోని, శంకరయ్య, షాగా చంద్రశేఖర్ రెడ్డి, కంది లక్ష్మారెడ్డి, ముత్యాల భూపాల్ రెడ్డి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, గుజ్జుల సురేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పోలపల్లి లక్ష్మి ముత్తయ్య, ఆలే శ్రీలత చిరంజీవి, బుడ్డ సురేష్, మునగాల తిరుపతిరెడ్డి, మునగాల అమరేందర్ రెడ్డి, చినుకని మల్లేశం, ఉడుగు వెంకటేశం గౌడ్, కదారి ఐలయ్య, యాస అశోక్ రెడ్డి, పబ్బతి శేఖర్, రాజశేఖర్, వెంకట్ రెడ్డి, బూత్ అధ్యక్షులు, కార్యదర్శులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ మెంబర్స్ గా కందుల హనుమంతు, మేడి ముకుందం



**రామన్నపేట వెలుతురు న్యూస్ మే 21:** మండల కేంద్రం శ్రీ మల్లికార్జున గార్డెన్ లో ఈనెల 18, 19 న. తేదీలన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3.వ.మహాసభ లో. జిల్లా కమిటీ మెంబర్.గా కందుల హనుమంతు. మరియు మేడి ముకుందం జిల్లా కమిటీ మెంబర్ ఎన్నిక అయినారు మా యొక్క ఎన్నిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొండమడుగు. నరసింహ జల్లెల పెంటయ్య.సహకారంతో ఎన్నుకోవడంజరిగింది. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యవసాయ కార్మిక సంఘం . ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం మని వేముల మహేందర్. రొడ్డ అంజయ్య అమరుల.ఆశయాలను ముందుకు తీసుకుపోతా మని మా ఎన్నికకుసహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

# మందకృష్ణ మాదిగ గారిని కలిసి వినతిపత్రం ఇచ్చిన దళిత బంధు లబ్ధిదారులు

మోత్కూర్, మే21,(వెలుతురు న్యూస్) గురువారం నాడు హైదరాబాద్ లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారి నివాసంలో మోత్కూరు మరియు అడ్డగూడూరు మండలాల దళిత బంధు లబ్ధిదారులు డా" బుషిపాక గణేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. 28/01/2025 న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఎండి గారు రెండవ విడత దళిత బంధు నిధులను గ్రౌండింగ్ పూర్తి చేసి లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆర్డినెన్స్ జారీ చేశారు. కొన్ని జిల్లాల కలెక్టర్లు సక్రమంగా ఆర్డినెన్స్ ను అమలు చేశారు కానీ యాదాద్రి జిల్లా కలెక్టర్ గారు మరియు తుంగతుర్తి శాసనసభ్యులు గౌరవ మందుల సామేలు గారు రెండున్నర సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తున్నారనీ మందకృష్ణ మాదిగ గారికి వివరించారు. అనంతరం ఆర్డినెన్స్ కాపీలను మంద కృష్ణ మాదిగ గారికి అందించారు. మంద కృష్ణ మాదిగ సానుకూలంగా స్పందించి సంబంధిత మంత్రి గారితో ప్రత్యక్షంగా మాట్లాడతానని రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 2వ విడత దళిత బంధు నిధులు విడుదల అయ్యేలా చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. మంద కృష్ణ మాదిగ గారిని



కలిసిన వారిలో బాలెంల నరేందర్ జిల్లా శివాజీ,చెడే సైదులు, జక్కుల గిరిబాబు,బుషిపాక సంజీవ ,బండి వెంకటేష్,శ్రీరాములు ప్రదీప్ కొండ్ర ప్రభు, నాగరాజు, నిరంజన్ ఉన్నారు.

# భువనగిరి బహార్ పేట దళితుల స్మశానవాటిక భూమిలో అక్రమ నిర్మాణాలు వెంటనే తొలగించాలి

**భువనగిరి మే, 21 (వెలుతురు న్యూస్):** భువనగిరి పట్టణంలో 26 వార్డులో బహార్ పేటలో నీ సర్వే నెంబర్ 804 దళితుల స్మశాన వాటికలో కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపట్టి నారు. వాటిని తొలగించాలని సిపిఐఎం భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తరువాత తహసిల్దార్ గారికి కూడా వినతి పత్రం ఇవ్వడం జరిగింది. 2014 అట్టి భూమిని సర్వే చేయించి హద్దులు నిర్ణయించడం జరిగినది. ఆ ఖాళీ స్థలంలో ఇది స్మశాన వాటికకు సంబంధించిన భూమి అని కూడా బోర్డు నాటడం జరిగినది. ఆ బోర్డును



తీసివేసి కొందరు అక్కడ అక్రమ నిర్మాణాలు చేపట్టినారు వాటిని తీసివేయాలని అధికారులకు చెప్పగా వారి స్పందించి ఈరోజు సర్వే వారిని పంపించడం జరిగినది. స్మశాన వాటిక స్థలాన్ని వారు సర్వే చేయడం జరిగినది. ఈ రిపోర్ట్ త్వరగా అందజేస్తామని కూడా చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య, దండు లత, బట్టుపల్లి రమేష్, బట్టుపల్లి నవీన్ కుమార్,మేకల జ్ఞానేశ్, సర్వేర్ కనకా రావు పాల్గొన్నారు

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పాడి గేదె మృతి

భువనగిరి మే, 21 (వెలుతురు న్యూస్): భువనగిరి మండలం సిరివెణికుంట గ్రామంలో ఘటన సర్వీస్ వైరు తెగి పడడంతో రైతు పడాల సత్యనారాయణకు చెందిన గేదె మృతి సర్వీస్ వైరు ప్రమాదకరంగా ఉందని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతు ఆవేదన. వెంటనే స్పందించి నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని బాధిత కుటుంబం విజ్ఞప్తి.



# రాజీవ్ గాంధీ విగ్రహానికి ఘన నివాళులర్పించిన ఎంపి చామల



**భువనగిరి మే 21 (వెలుతురు న్యూస్ ):** భారత రత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా తెలంగాణ సచివాలయంలోని ఆయన విగ్రహానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను ఆయన స్మరించుకున్నారు. ముఖ్యంగా స్థానిక పాలనను బలోపేతం చేస్తూ రాజీవ్ గాంధీ తెచ్చిన సంస్కరణలు, సాంకేతిక విప్లవం దేశ భవిష్యత్తునే మార్చేశాయని కొనియాడారు.

# సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా .... యాదగిరిగుట్టలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ...

- ఈనెల 23వ తేదీన యాదగిరిగుట్టకు రానున్న సీఎం రేవంత్ రెడ్డి
- 22వ తేదీనే గుట్టకు చేరుకోనున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి
- మీడియా సమావేశంలో వెల్లడించిన యాదగిరిగుట్ట దేవస్థానం ( వై టి డి ) ఈవో జె భవాని శంకర్

పుట్ట హనుమంత్ (సీనియర్ జర్నలిస్ట్ )



**యాదగిరిగుట్ట, మే 21 వెలుతురు న్యూస్:** యాదగిరిగుట్ట దేవస్థానానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరోసారి రానున్నారు. దేవస్థానంలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేందుకు ఆయన ఈనెల 23వ తేదీన యాదగిరిగుట్టకు రానున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం ( వై టి డి ) ఈవో జె భవాని శంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం యాదగిరిగుట్ట దేవస్థానం ప్రధాన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదగిరిగుట్ట దేవస్థానంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఈనెల 23వ తేదీ శనివారం రోజున సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. టెంపుల్ సిటీలో కేటాయించిన సుమారు 15 ఎకరాల స్థలంలో వేద పాఠశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఈ వేద పాఠశాల నిర్మాణాన్ని సుమారు 43 కోట్లతో పూర్తి చేయనున్నారు. అదేవిధంగా గుట్ట దేవస్థానంలో 43 కోట్లతో దీక్షా పరుల మండపం, కొండ కింద వైకుంఠ ద్వారం నుండి కొండపైకి వెళ్లే మెట్ల మార్గంలో ఒక కోటి నలభై ఒక్క లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న షెడ్డు నిర్మాణ పనులకు, 9 కోట్ల పైచిలుకు నిధులతో నిర్మించనున్న నిత్య కళ్యాణ మండపం, ఒక కోటి 45 లక్షల వ్యయంతో కొండపైన ఉన్న లిఫ్ట్ పక్కనుండి పైకి నిర్మించనున్న మెట్ల మార్గం తదితర అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు . ఈ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటుగా పలువురు మంత్రులు ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరుకానున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం ( వైటిడి ) ఈవో జె భవాని శంకర్ తెలిపారు. 23వ తేదీన ఉదయం సుమారు 9 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్టకు చేరుకోనున్నారని ఆయన చెప్పారు. ప్రతి నిత్యం కొండపైన సుమారు 500 మంది భక్తులచే స్వామి వారి నిత్య కళ్యాణం జరిపించే విధంగా కళ్యాణమండపం పెద్ద ఎత్తున నిర్మించేందుకు శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ నిర్మాణాన్ని పాత బాలాలయం స్థలంలో చేపట్టనున్నామని తెలిపారు. అదేవిధంగా మండల , అర్థ మండల దీక్షలు చేసే భక్తులకు దీక్షాపరుల మండపాన్ని 5 అంతస్తులలో నిర్మించనున్నామని చెప్పారు. గ్రౌండ్ ఫ్లోర్ లో పార్కింగ్ తో పాటుగా పైన దీక్షాపరులకు తగిన వసతులతో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేయనున్నామని వివరించారు. సుమారు 400 నుండి 500 మంది దీక్షపరులు నిద్ర చేసే విధంగా నిర్మాణం చేయనున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న లిఫ్టు పక్కన పైకి నడిచి వెళ్లే విధంగా మెట్లు నిర్మించడం వల్ల భక్తులకు ఎంతగానో సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. సీఎం పర్యటన సందర్భంగా ఈనెల 23వ తేదీన భక్తులకు , స్థానికులకు కొంత అసౌకర్యం కలగవచ్చని వారంతా పరిస్థితిని అర్థం చేసుకొని తమతో సహకరించి దేవస్థానం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈవో జె భవాని శంకర్ కోరారు. 22న యాదగిరిగుట్టకు చేరుకోనున్న కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం కళా వేదిక వద్ద సుమారు 24 మంది వేద పండితులచే వేద సదస్సు నిర్వహించనున్నామని, ఈ వేద సదస్సులో చతుర్వేద పారాయణాలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారు పాల్గొని వేద పండితులను సత్కరించనున్నారు అని చెప్పారు. అనంతరం భక్తులను , స్థానికులను దేవస్థానం వారిని ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేయనున్నారని చెప్పారు. యాదగిరిగుట్టలో సుమారు 100 కోట్ల నిధులతో నిర్మాణం చేయనున్న ఐదు రకాల అభివృద్ధి పనులకు యాదగిరిగుట్ట దేవస్థానం తో పాటు దాతల నుండి , ప్రభుత్వం నుండి ఉమ్మడిగా నిధులు సమీకరించి అభివృద్ధి పనులను పూర్తి చేయనున్నామని చెప్పారు. ఈ పనులను అనుకున్న కాలంలో పూర్తిస్థాయిలో నిర్మాణం చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఈవో జె భవాని శంకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు స్థానికులు, భక్తులు ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో తమకు సహకరించాలని కోరారు. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి రాక కోసం పూర్తిస్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. భద్రతాపరమైన చర్యల కోసం పోలీసు శాఖ వారితో, ఇతర ఏర్పాట్ల విషయంలో స్థానిక మున్సిపాలిటీ వారితో, జిల్లా కలెక్టర్ , జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో , వివిధ శాఖల వారీగా సమన్వయం చేసుకుంటూ తగిన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఆయన వెంట దేవస్థానం డిఇఓ నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

# రైతుల దోపిడీ ఆపాలి – యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేపట్టాలి...

- **కొనుగోలు కేంద్రాల్లో జాప్యం, మౌలిక వసతుల లేమిపై బీజేపీ ఆగ్రహం.**
- **న్యాల్కల్ మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పణ...**



**జహీరాబాద్ వెలుతురు మే 21 :** రాష్ట్రంలోని ధాన్యం మరియు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతులకు న్యాయం చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. గురువారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని న్యాల్కల్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షులు మల్లేష్ గంగ్వార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచాల్సి రావడంతో రైతులకు ఆర్థిక నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ధాన్యం తడిసిపోవడంతో నాణ్యత దెబ్బతింటోందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం, తూకం ప్రక్రియలో ఆలస్యం, తరుగు మరియు తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం వంటి అంశాలపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల శ్రమను దోపిడీ చేసే విధానాలను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి, యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, షెడ్లు, తూకం యంత్రాలు, సిబ్బంది వంటి సౌకర్యాలను తక్షణమే కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షులు సునార్ విష్ణు, బీజేపీ మండల ఉపాధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, మండల కార్యదర్శి నర్సింలు, బీజేపీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 49వ డివిజన్లో పెన్షన్ అప్ గ్రేడ్ ను సద్వినియోగం చేసుకోవాలి

- **కార్పొరేటర్ ఏన్నం లక్ష్మీ ప్రకాష్**





**కరీంనగర్ వెలుతురు మే 21:** కరీంనగర్ నగరపాలక సంస్థ 49 డివిజన్ ప్రజలకు సంబదించిన పెన్షన్స్ అప్రేడ్ కార్యక్రమాన్ని గురువారం రోజున స్థానిక డివిజన్ కార్పొరేటర్ ఎన్నం లక్ష్మి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఏన్నం లక్ష్మీ ప్రకాష్ మాట్లాడుతూ పెన్షన్ అప్రేడ్ కార్యక్రమం జూన్ 15 వరకు కొనసాగుతుందని, డివిజన్ లో పెన్షన్ తీసుకుంటున్నారో వారందరూ తప్పకుండా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తీసుకుని వార్డ్ ఆఫీసర్ ,సంబధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి 12:00 వరకు పెన్షన్ అప్రేడ్ చేయించుకోవచ్చని తెలిపారు. పెన్షన్ అప్ గ్రేడ్ టీం కార్పొరేటర్ కార్యాలయం, సనాతన దర్మం సేవా సమితి లో అందుబాటులో ఉంటారని తెలిపారు.. గురువారం రోజున దాదాపు గా 100 మంది వరకు పెన్షన్ లను వార్డు ఆఫీసర్ మండే శిరీష అప్డేట్ చేశారు. ఈ కార్యక్రమంలో లంబు సుధాకర్ రెడ్డి, గాధగోని రమేష్, ఉమారాణి, విజయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా లక్ష్మీ సుదర్శన యాగం

**వెలుతురు నారాయణఖేడ్ మే 21:** సంగారెడ్డి జిల్లా : నారాయణఖేడ్ పట్టణంలోని మహతి జ్యోతిష్యాలయంలో లక్ష్మీ సుదర్శన యాగం గురువారం నాలుగో రోజు అత్యంత వైభవంగా కొనసాగింది. బ్రహ్మశ్రీ మలమంచి గురురాజు శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజ, సుదర్శన యాగ హోమం కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. లోక కళ్యానార్థం నెల రోజుపాటు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తులు స్వామివారి కృపాకటాక్షాలు పొందాలని గురుపంతులు అన్నారు.



లక్ష్మీ సుదర్శన యాగం కార్యక్రమంలో



# ఘనంగా బిజెపి నేత, కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ జన్మదిన వేడుకలు

కరీంనగర్ వెలుతురు మే 21: కరీంనగర్ నగరపాలక సంస్థ , ఏడవ డివిజన్ బిజెపి నేత, కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. తోట సాగర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి కార్యకర్తలు అన్నప్రసాద వితరణ, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు తోట సతీష్ తదితరులు పాల్గొన్నారు.





# హత్నూరలో ధాన్యం కొనుగోలు నిర్లక్ష్యం – అధికారులపై కలెక్టర్ సీరియస్ చర్యలు



- **డి.సి.ఓ, హత్నూర ఎంపీడీవో, ఏపీఎంలకు షోకాజ్ నోటీసులు జారీ – మూడు రోజుల్లో వివరణ కోరిన కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి జిల్లా వెలుతురు మే 21:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, సమన్వయ లోపాలు, పర్యవేక్షణ వైఫల్యాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని ధాన్యం కొనుగోలు వ్యవస్థపై ఫీల్డ్ స్థాయి పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించారు.

**హత్నూరలో ధాన్యం కొనుగోలు వ్యవస్థలో లోపాలు బయటపడ్డాయి**

హత్నూర మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని ప్రాథమికంగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాల నిర్వహణ, లాజిస్టిక్స్ సమన్వయం, టోకెన్ విధానం అమలు, ధాన్యం నిల్వ, తరలింపు వంటి అంశాల్లో స్పష్టమైన లోపాలు కనిపించినట్లు వెల్లడైంది. ఈ కారణంగా రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

**రైతుల ఇబ్బందులపై కలెక్టర్ తీవ్ర ఆందోళన**

ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమాచారం. వాతావరణ పరిస్థితులు, నిల్వ సమస్యలు, వాహనాల కొరత వంటి కారణాలతో ధాన్యం కొనుగోలు ఆలస్యం అవుతున్నట్లు గుర్తించారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆ బాధ్యతలు సక్రమంగా అమలు కాలేదని కలెక్టర్ పేర్కొన్నారు.

**సమన్వయ లోపాలపై అధికారులపై ఆగ్రహం**

జిల్లా సహకార అధికారి, ఎంపీడీవో, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ వంటి విభాగాల మధ్య సరైన సమన్వయం లేకపోవడం వల్ల కొనుగోలు ప్రక్రియ తీవ్రంగా ప్రభావితమైందని తేలింది. ప్రతి శాఖ తన బాధ్యతను సమన్వయంతో నిర్వహించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఫీల్డ్ స్థాయిలో అనుసంధానం లోపించిందని అధికారులు నివేదించారు. దీనిపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఫీల్డ్ పర్యవేక్షణలో వైఫల్యం ప్రధాన కారణం**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ లేకపోవడం వల్ల సమస్యలు మరింత తీవ్రమయ్యాయని అధికారులు పేర్కొన్నారు. రోజువారీ మానిటరింగ్, రిపోర్టింగ్ వ్యవస్థ బలహీనంగా ఉండటంతో సమస్యలు సకాలంలో పరిష్కారం కాలేదని గుర్తించారు. ఫీల్డ్ ఆఫీసర్లు తమ విధుల్లో నిర్లక్ష్యం వహించారని ఆరోపణలు వెలువడ్డాయి.

**స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా అమలు లోపం**

గతంలోనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పలుమార్లు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడం గమనార్హమని అధికారులు తెలిపారు. ఆదేశాల అమలులో నిర్లక్ష్యం వహించిన కారణంగా రైతులు నష్టపోతున్నారని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు

**మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం**

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన కలెక్టర్, మూడు రోజుల్లోగా పూర్తి వివరణ సమర్పించాలని స్పష్టం చేశారు. నిర్లక్ష్యం ఎందుకు చోటుచేసుకుందో, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తీసుకోబోయే చర్యలపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

**బాధ్యతల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరిక**

ధాన్యం కొనుగోలు వ్యవస్థ రైతుల జీవనాధారానికి సంబంధించిన కీలక ప్రక్రియ అని, ఇందులో ఏ విధమైన నిర్లక్ష్యాన్నీ సహించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారుల బాధ్యతను తప్పించుకోవడం, సమన్వయం లేకపోవడం వంటి చర్యలు తీవ్రమైన పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు

**కొనుగోలు కేంద్రాల్లో తక్షణ మార్పులు అవసరం**

హత్నూర మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తక్షణమే సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన సిబ్బందిని వినియోగించడం, లాజిస్టిక్స్ మెరుగుపరచడం, రైతులకు వేచి ఉండే సమయం తగ్గించడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి కేంద్రంలో పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు.

**రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచన**

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు విధానంలో రైతులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ పంటను సకాలంలో విక్రయించుకోగలిగేలా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన పేర్కొన్నారు. ఏ చిన్న నిర్లక్ష్యం అయినా పెద్ద సమస్యలకు దారితీస్తుందని హెచ్చరించారు.

**హత్నూర ఘటనపై జిల్లాలో చర్చ**

హత్నూర మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ధాన్యం కొనుగోలు వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ఉన్నతాధికారులు మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. రైతుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉన్నట్లు అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ చేష్మొద్దీన్





- **ఈజిఎస్ కార్మిక మ్యాండెట్‌తోనే కేంద్ర సంక్షేమ పథకాలు : కార్యదర్శి భాగ్యలక్ష్మి....**

**జహీరాబాద్ వెలుతురు, మే 21 :** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని కుటుంబ ఆర్థికాభివృద్ధికి ఉపయోగించుకోవాలని శేఖపూర్ గ్రామ సర్పంచ్ మొహమ్మద్ చేష్మొద్దీన్ అన్నారు. జహీరాబాద్ మండలంలోని శేఖపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు, కూలీలు వంద రోజుల పనిని పొందవచ్చని, చేసిన పనికి రెండు వారాల్లో వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, ఈజిఎస్ పథకంలో కూలీల మ్యాండెట్ ఆధారంగానే గ్రామాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. కార్మికులు అధిక సంఖ్యలో పనులకు హాజరవుతే సీసీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు మరిన్ని నిధులు వచ్చే అవకాశం ఉంటుందని గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేష్మొద్దీన్, కార్యదర్శి భాగ్యలక్ష్మి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ న్యామాతబాద్ పద్మమ్మ, ఈజిఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మ్యాతారి రూబెన్, మెంబర్లు జాహెద్ అలీ సంగేమ్, మొహమ్మద్ జహిరుద్దీన్, గౌసొద్దీన్ గుల్బార్గవాలె, శ్రీనివాస్, సమ్మప్ప పర్తగారి తదితరులు పాల్గొన్నారు.

# హిందూ స్మశాన వాటిక పనులకు భూమిపూజ చేసిన కౌన్సిలర్ ప్రతినిధి నరేష్ గౌడ్

- **స్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా : నరేష్ గౌడ్....**



**జహీరాబాద్ వెలుతురు, మే 21 :** భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని 6వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ తెలిపారు. గురువారం పట్టణంలోని రంజోల్ ప్రాంతంలోని హిందూ స్మశాన వాటికలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. స్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పన కోసం తన సొంత ఖర్చులతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక సదుపాయాల కల్పనకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. స్మశాన వాటికను పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుల సంఘాల పెద్దలు, 6వ వార్డు ప్రజలు, యువకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ యూనిట్ & ఎస్ ఓ టీ, సైబరాబాద్ పోలీసుల సంయుక్త ఆపరేషన్‌లో మ్యూల్ అకౌంట్ సరఫరాదారు అరెస్ట్

సైబరాబాద్ వెలుతురు మే 21:
సైబర్ క్రైమ్ పోలీస్ మరియు ఎస్ ఓ టీ, సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సైబర్ మోసాలకు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సరఫరా చేస్తున్న ఒక నిందితుడిని అరెస్ట్ చేశారు. నిందితుడు మరియు అతని సహచరులు ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ గేమింగ్, స్టాకింగ్, పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్స్ మరియు ఇతర ఆన్‌లైన్ ఆర్థిక మోసాలలో ఈ మ్యూల్ అకౌంట్లను ఉపయోగించి అమాయక ప్రజల నుండి భారీ మొత్తంలో డబ్బును మోసపూరితంగా సేకరించినట్లు విచారణలో బయటపడింది. ఈ కేసు Cr.No.1040/2026, U/Sec 204, 308, 318(4), 319(2), 336(3), 338, 340(2) r/w 3(5) BNS మరియు Sec 66C & D r/w 43 IT Act2000/2008 కింద నమోదు చేయబడింది.

**నిందితుడి వివరాలు:**
A3 దిలీప్ సింగ్,
తండ్రి పేరు: చిమన్ సింగ్
వయస్సు: 27 సంవత్సరాలు
వృత్తి: ప్రైవేట్ ఉద్యోగం (రాపిడో డెలివరీ బాయ్)
చిరునామా: అపూరూప కాలనీ, ఐడిఏ జీడిమెట్ల, మెడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ
స్థిర నివాసం: నాగూర్ జిల్లా, రాజస్థాన్

అరెస్ట్ చేసిన తేదీ:
21052026 ఉదయం 04:00 గంటలకు
నేరం చేసే విధానం (MODUSOPERANDI):
2024 సంవత్సరంలో నిందితుడు ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన ప్రకటనల ద్వారా "జోర్డాన్" మరియు "పింటూ భయ్యా" అనే వ్యక్తులతో పరిచయం ఏర్పరుచుకున్నాడు. వాట్సాప్ అంతర్జాతీయ నంబర్ల ద్వారా సంప్రదించి బ్యాంక్ అకౌంట్లు సమకూర్చితే కమిషన్ ఇస్తామని ఆఫర్ చేశారు.
సేవింగ్స్ అకౌంట్‌కు రూ.25000/
కరెంట్ అకౌంట్‌కు రూ.50000/
ఈ అకౌంట్లు ట్రేడింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, గేమింగ్, పార్ట్‌టైమ్ జాబ్ ఫ్రాడ్స్ వంటి సైబర్ నేరాలకు ఉపయోగిస్తారని తెలిసినా, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నిందితుడు అంగీకరించాడు. తరువాత తనకు చెందినవి మరియు ఇతరుల బ్యాంక్ అకౌంట్లను సేకరించి, ATM కార్డులు, SIM కార్డులు, పాస్‌బుక్స్, చెక్‌బుక్స్ మరియు ఇతర బ్యాంకింగ్ పత్రాలను సైబర్ నేరగాళ్లకు కమిషన్ కోసం అందజేశాడు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు:**
A3 నుండి:
1. నగదు - రూ.1,02,000/
2. రియల్‌మీ మొబైల్ ఫోన్ - 1






3. ఐఫోన్ - 1
4. వివో మొబైల్ ఫోన్ - 1
5. డెబిట్ కార్డులు - 12
6. క్రెడిట్ కార్డ్ - 1
7. బ్యాంక్ పాస్‌బుక్స్ - 3
8. చెక్‌బుక్స్ - 7
9. వివిధ రాష్ట్రాలకు కొరియర్ చేసిన 33 బ్యాంక్ పాస్‌బుక్స్

విచారణలో కొంతమంది సంబంధిత బ్యాంక్ ఉద్యోగులు నిందితులతో కుమ్మక్కై అకౌంట్లు తెరవడం మరియు వాటిని సైబర్ మోసాలకు సరఫరా చేయడంలో సహకరించినట్లు ప్రాథమికంగా వెలుగులోకి వచ్చింది. ఈ కోణంలో మరింత దర్యాప్తు కొనసాగుతోంది.

ప్రజలకు హెచ్చరికలు మరియు సూచనలు (PUBLIC ADVISORY):
సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం "మ్యూల్ అకౌంట్లు" ద్వారా మోసపూరితంగా సంపాదించిన డబ్బును ట్రాన్స్‌ఫర్ చేయడం, విత్‌డ్రా చేయడం మరియు మనీలాండరింగ్‌కు ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ ఫ్రాడ్, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్, గేమింగ్ యాప్స్, లోన్ యాప్స్, జాబ్ ఫ్రాడ్స్ వంటి కేసుల్లో ఈ అకౌంట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

**ప్రజలు కింది సూచనలు తప్పనిసరిగా పాటించాలి:**
డబ్బు ఆశతో ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంక్ అకౌంట్లు అద్దెకు ఇవ్వకండి, అమ్మకండి లేదా ఇతరులకు వినియోగించేందుకు ఇవ్వకండి.
ATM కార్డులు, చెక్‌బుక్స్, SIM కార్డులు, OTPలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు మరియు KYC పత్రాలను ఇతరులతో పంచుకోవద్దు. "ఈజీ మనీ", "అకౌంట్‌కు కమిషన్" వంటి సోషల్ మీడియా ప్రకటనలను నమ్మవద్దు. కొత్తగా ఓపెన్ చేసిన బ్యాంక్ అకౌంట్లను ఇతరులకు వినియోగానికి ఇవ్వడం వల్ల ఆ అకౌంట్ హోల్డర్ నేర కేసుల్లో నేరుగా ఇరుక్కొనే అవకాశం ఉంటుంది. మ్యూల్ అకౌంట్లలో పాల్గొన్న వారి బ్యాంక్ అకౌంట్లు ఫ్రీజ్ చేయబడవచ్చు, ఆర్థిక నష్టం కలగవచ్చు, పోలీస్ విచారణ, అరెస్ట్ మరియు చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి రావచ్చు. బ్యాంక్ వివరాలు అడిగే వ్యక్తుల అసలు ఉద్దేశ్యం మరియు గుర్తింపును నిర్ధారించుకోండి. బ్యాంక్ అకౌంట్ లావాదేవీలను తరచుగా పరిశీలిస్తూ అనుమానాస్పద ట్రాన్సాక్షన్లు గమనిస్తే వెంటనే బ్యాంక్ మరియు పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, డెలివరీ బాయ్స్ మరియు గిగ్ వర్కర్లు సోషల్ మీడియా ద్వారా వచ్చే కమిషన్ ఆఫర్లకు మోసపోవద్దు. అనుమానాస్పద సైబర్ కార్యకలాపాలను సమీప పోలీస్ స్టేషన్ లేదా National Cyber Crime Reporting Portal ద్వారా వెంటనే ఫిర్యాదు చేయాలి. సైబర్ ఆధారిత ఆర్థిక నేరాల నివారణలో ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పుల్వామా దాడి కీలక సూత్రధారి హమ్జా బుర్హాన్ హతం

- **పాక్ ఆక్రమిత కశ్మీర్ ముజఫరాబాద్‌లో కాల్పుల్లో బుర్హాన్ మృతి**
- **గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం**
- **2019 పుల్వామా ఆత్మాహుతి దాడి వెనుక కీలక పాత్రధారిగా గుర్తింపు**
- **2017లో పాకిస్థాన్‌కు వెళ్లిన బుర్హాన్ ఉగ్రవాద కార్యకలాపాల్లో ప్రవేశం**
- **నిషేధిత అల్-బదర్ ఉగ్రసంస్థలో చేరిన తర్వాత కమాండర్ స్థాయికి ఎదుగుదల**





ఢిల్లీ వెలుతురు మే 21:
పుల్వామా ఉగ్రదాడి కేసులో కీలక సూత్రధారిగా భావిస్తున్న హమ్జా బుర్హాన్ హతమైనట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ముజఫరాబాద్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో అతడు మృతి చెందినట్లు స్థానిక మీడియా వర్గాలు, భద్రతా వర్గాల సమాచారం ఆధారంగా తెలుస్తోంది. ఈ ఘటనతో 2019 పుల్వామా దాడి కేసు మరోసారి అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. భద్రతా వర్గాల వివరాల ప్రకారం, పుల్వామాకు చెందిన హమ్జా బుర్హాన్ 2017లో ఉన్నత విద్యాభ్యాసం పేరుతో పాకిస్థాన్‌కు వెళ్లాడు. అక్కడకు చేరుకున్న తర్వాత అతడు నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్‌బదర్‌లో చేరినట్లు సమాచారం. కొద్దికాలంలోనే సంస్థలో కీలక బాధ్యతలు చేపట్టి కమాండర్ స్థాయికి ఎదిగినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఉగ్రవాద కార్యకలాపాల సమన్వయం, నియామకాలు, శిక్షణ కార్యక్రమాల్లో అతడి పాత్ర కీలకంగా ఉన్నట్లు భావిస్తున్నారు. భారత నిఘా సంస్థలు 2022లో హమ్జా బుర్హాన్‌ను అధికారికంగా ఉగ్రవాదిగా ప్రకటించాయి. పుల్వామా దాడి ప్రణాళికలో అతడి పాత్రపై అప్పటికే పలు ఆధారాలు సేకరించినట్లు సమాచారం. అయితే అతడు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో తలదాచుకుంటూ ఉగ్ర కార్యకలాపాలను కొనసాగించినట్లు తెలుస్తోంది. గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామా ప్రాంతంలో జరిగిన ఆత్మాహుతి దాడి భారత చరిత్రలోనే అత్యంత ఘోర ఉగ్రదాడులలో ఒకటిగా నిలిచింది. సీఆర్‌పీఎఫ్ జవాన్లను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు పేలుడు పదార్థాలతో నిండిన వాహనంతో జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు అమరులయ్యారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఈ దాడి వెనుక పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ హస్తం ఉన్నట్లు భారత నిఘా సంస్థలు స్పష్టం చేశాయి. ఆ సంస్థకు చెందిన అగ్రనేత మసూద్ అజర్ ఆధ్వర్యంలో ఈ దాడి ప్రణాళిక రూపొందించబడినట్లు అప్పట్లో వెల్లడైంది. పుల్వామా దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం మరియు భారత వైమానిక దళం కలిసి 2019 ఫిబ్రవరి 26న పాకిస్థాన్ భూభాగంలోని బాలాకోట్‌పై వైమానిక దాడులు చేపట్టాయి. తెల్లవారుజామున జరిగిన ఈ దాడుల్లో జైషే మహమ్మద్ ఉగ్ర శిక్షణ శిబిరాలను లక్ష్యంగా చేసుకుని బాంబుల వర్షం కురిపించబడింది. ఈ చర్యను భారత్ "సర్జికల్ స్ట్రైక్ 2.0"గా భావించింది.
బాలాకోట్ దాడుల అనంతరం పాకిస్థాన్ కూడా ప్రతీకార చర్యలకు దిగింది. పాక్ యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి చొరబడిన ఘటనలు అప్పట్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. భారత వైమానిక దళం వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. ఈ క్రమంలో జరిగిన వైమానిక ఎదురుకాల్పుల్లో భారత మిగ్21 యుద్ధ విమానం కూలిపోయింది. అదే ఘటనలో వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పాక్ భూభాగంలో ల్యాండ్ అయ్యి శత్రుచెరలో చిక్కుకున్నారు. ఆయనను పాకిస్థాన్ సైన్యం అదుపులోకి తీసుకోవడం అంతర్జాతీయంగా పెద్ద చర్చకు దారితీసింది. అయితే అంతర్జాతీయ ఒత్తిడి, దౌత్య ప్రయత్నాల నేపథ్యంలో మూడు రోజుల తర్వాత పాకిస్థాన్ ఆయనను భారత్‌కు అప్పగించింది. అభినందన్ ధైర్యసాహసాలు ఆ సమయంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయి. ఇప్పుడు పుల్వామా దాడి సూత్రధారిగా భావిస్తున్న హమ్జా బుర్హాన్ మృతి చెందినట్లు వచ్చిన వార్తలు భద్రతా వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు అధికారిక ధృవీకరణ పూర్తిగా వెలువడలేదు. ముజఫరాబాద్‌లో జరిగిన కాల్పుల ఘటనలో అతడు చనిపోయాడన్న సమాచారం మాత్రం పలు వర్గాల్లో చర్చనీయాంశమైంది. భారత భద్రతా సంస్థలు ఈ వార్తలపై నిఘా పెంచినట్లు తెలుస్తోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతంలో ఉన్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ల కదలికలను కూడా గమనిస్తున్నాయి. పుల్వామా దాడికి సంబంధించిన మిగతా నిందితుల గురించి సమాచారం సేకరణ కొనసాగుతోందని భద్రతా వర్గాలు పేర్కొంటున్నాయి. ఉగ్రవాద నెట్‌వర్క్‌లలో కీలక పాత్రధారులు ఒకరి తర్వాత ఒకరు హతమవుతున్న ఘటనలు ఆ సంస్థల కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఇలాంటి ఘటనలు పూర్తిగా ఉగ్రవాద సమస్యను పరిష్కరించలేవని, సమగ్ర వ్యూహం అవసరమని కూడా నిపుణులు సూచిస్తున్నారు. మొత్తం మీద, పుల్వామా దాడి సూత్రధారి హమ్జా బుర్హాన్ మృతి చెందినట్లు వస్తున్న సమాచారం ఉగ్రవాద నిరోధక చర్యల నేపథ్యంలో కీలక పరిణామంగా పరిగణించబడుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఈ పరిణామం నిజమైతే పుల్వామా కేసులో ఒక కీలక మలుపుగా భావించవచ్చు.

# నవ్య కుటుంబానికి అండగా నిలిచిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



- **శుక్రవారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు నవ్య మృతదేహం**
- **నవ్య కుటుంబానికి రూ.70 లక్షల ఫండ్ రైజ్ చేసిన తానా సభ్యులు**
- **విదేశాల్లో ఉన్నా తెలుగు ప్రజల మానవత్వం మరోసారి వెలుగుచూసింది- మంత్రి**
- **ప్రభుత్వ ఖర్చులతో నవ్య భౌతికకాయం స్వదేశానికి తరలింపు**
- **"కూతురిని కోల్పోయిన ఆ కుటుంబ బాధ నా మనసును కలిచివేసింది... వారు ఒంటరిగా లేరు" — మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు మే 21:**
అమెరికాలో గత శనివారం అర్ధరాత్రి జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెరువుగట్టు గ్రామానికి చెందిన గడుసు శ్రీనివాస్ రెడ్డి - శోభ దంపతుల కుమార్తె గడుసు నవ్య భౌతికకాయం మూడు రోజుల వ్యవధిలోనే స్వగ్రామానికి చేరుకునేలా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో నవ్య మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ప్రభుత్వ ఖర్చులతోనే మృతదేహాన్ని స్వదేశానికి తరలించే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉన్నత చదువులతో కుటుంబానికి అండగా నిలవాలన్న ఆశయంతో అమెరికా వెళ్లిన నవ్య... ఎం.ఎస్ పూర్తి చేసి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని భావించిన సమయంలోనే ఈ విషాదం చోటుచేసుకోవడం అందరినీ కలిచివేసింది. కుమార్తె భవిష్యత్తు కోసం భూమిని అమ్ముకుని, అప్పులు చేసి చదివించిన తల్లిదండ్రులకు ఇది తీరని విషాదంగా మారింది. అనారోగ్యంతో బాధపడుతున్న తల్లి శోభ పరిస్థితి, కుటుంబం ఎదుర్కొంటున్న ఆవేదన గురించి తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "ఆ కుటుంబం అనుభవిస్తున్న బాధను మాటల్లో చెప్పలేం. కూతురిని కోల్పోయిన ఆ తల్లిదండ్రుల కన్నీరు ప్రతి ఒక్కరినీ కలిచివేస్తోంది. వారు ఎప్పటికీ ఒంటరిగా ఉండరు... వ్యక్తిగతంగా నేను, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటాం" అని మంత్రి భరోసా ఇచ్చారు. సాధారణంగా విదేశాల నుంచి మృతదేహం స్వదేశానికి చేరేందుకు వారం రోజులకుపైగా సమయం పట్టే అవకాశమున్నప్పటికీ, కుటుంబ సభ్యుల బాధను గుర్తించిన మంత్రి వెంటనే రాష్ట్ర ఉన్నతాధికారులు, భారత ప్రభుత్వ విదేశాంగ అధికారులతో పాటు అమెరికాలోని తానా ప్రతినిధులు, శాన్ ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ప్రక్రియను వేగవంతం చేశారు. మంత్రి చేసిన విజ్ఞప్తికి స్పందించిన అమెరికాలోని తెలుగు సంఘం తానా సభ్యులు మానవతా హృదయంతో ముందుకొచ్చి సుమారు రూ.70 లక్షల ఫండ్ రైజ్ చేసి నవ్య కుటుంబానికి అండగా నిలిచారు. విదేశాల్లో ఉన్నా తెలుగు ప్రజల మానవత్వం ఎంత గొప్పదో మరోసారి నిరూపితమైందని మంత్రి అభినందించారు. నవ్య మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తరలించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని చికాగో ఎంబసీతో సమన్వయం చేసిన శాన్ ఫ్రాన్సిస్కో కాన్సులేట్ జనరల్ శ్రీకర్ రెడ్డికి, తానా టీం స్క్వేర్ కోచైర్మన్ చిరంజీవి గల్లా, హేమ కానూరు, భరత్ రెడ్డి, అమర్, శివ తదితరులకు మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "నా విజ్ఞప్తికి స్పందించి నవ్య కుటుంబానికి ధైర్యంగా నిలిచిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. నవ్య మరణం తీరని లోటు... ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు.

# విశాఖ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

- **మూడు కీలక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం**
- **అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నిధుల మంజూరు**
- **జీవీఎంసీ ప్రతిపాదనలకు నేషనల్ అపెక్స్ కమిటీ ఆమోదం**
- **మధురవాడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ అభివృద్ధి**
- **స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు**
- **బల్క్ వాటర్ సిస్టమ్ ఆధునీకరణకు ప్రాజెక్టు**
- **మొత్తం రూ.1,501 కోట్ల వ్యయంతో అమలు**
- **విశాఖ పట్టణ మౌలిక సదుపాయాలకు బలమైన ఊతం**
- **ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం**
- **విశాఖ అభివృద్ధిలో కీలక ముందడుగు**

**విశాఖపట్నం వెలుతురు మే 21:**
విశాఖపట్నం నగర మౌలిక సదుపాయాలు మరియు పట్టణాభివృద్ధికి సంబంధించి మూడు కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని విశాఖ ఎంపీ శ్రీభరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (UCF) పథకం కింద గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (GVMC) ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ (NAC) గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని ఆయన వెల్లడించారు. ఈ మూడు ప్రాజెక్టుల మొత్తం అంచనా వ్యయం రూ.1,501.03 కోట్లుగా నిర్ణయించబడింది. వీటిలో మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ.658.61 కోట్లు కేటాయించనున్నారు. దీని ద్వారా వర్షాకాలంలో మురుగు నీటి సమస్యను తగ్గించి, నగరంలోని డ్రైనేజ్ వ్యవస్థను ఆధునీకరించనున్నారు. అదే విధంగా మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు కోసం రూ.725.18 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఆధునిక సాంకేతికతతో నీటి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉంది. మూడవ ప్రాజెక్టుగా బల్క్ మరియు సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణకు రూ.117.24 కోట్లు కేటాయించారు. దీనివల్ల నగరానికి నీటి సరఫరా మరింత సమర్థవంతంగా, నిరంతరంగా అందించగలుగుతారని అధికారులు భావిస్తున్నారు. ఈ మూడు ప్రాజెక్టులు పూర్తయితే విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలు మరింత బలపడతాయని, ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మెరుగుదల వస్తుందని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. నగర అభివృద్ధి దిశగా ఇది ఒక కీలక ముందడుగు అని ఆయన పేర్కొన్నారు.



# మహిళా సాధికారతకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



- మే 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా వారోత్సవాలు

**హైదరాబాద్ వెలుతురు మే 21:** మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 25 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా "మహిళా వారోత్సవాలు" నిర్వహించనుంది. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామీణ మహిళలు, స్వయం సహాయక సంఘాలు, సంస్థలు, యువతులు, బాలికలు, దివ్యాంగులు, వృద్ధులు తో సహా అన్ని వర్గాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ వారం రోజుల పాటు విభిన్న కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన, జీవనోపాధుల విస్తరణ, సామాజిక భద్రత, ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి, మహిళా సంఘాల బలోపేతం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్, రుణమేళాలు నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా మే 29న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వెత్తల కోసం ఇంక్యుబేటర్ ప్రోగ్రాం ప్రారంభం, జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్ కార్యక్రమం నిర్వహించనుండటం ఈ వారోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు ఆర్థిక అవకాశాలు విస్తరించే దిశగా ఈ కార్యక్రమం కీలక మైలురాయిగా నిలుస్తుంది. మహిళా సంఘాలను కేవలం పొదుపు సమూహాలుగా కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించే ఉత్పాదక శక్తులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలకు బ్యాంకు రుణాలు, జీవనోపాధి యూనిట్లు, సూక్ష్మ పరిశ్రమలు, వ్యవసాయ ప్రాసెసింగ్ కేంద్రాలు, సౌర విద్యుత్ ప్రాజెక్టులు వంటి అవకాశాలను గ్రామ స్థాయికే తీసుకెళ్తున్నామని చెప్పారు. మహిళల చేతుల్లో ఆదాయం పెరిగితే కుటుంబాలు బలపడటమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా మరింత పటిష్టమవుతుందని పేర్కొన్నారు. మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రతి కార్యక్రమం మహిళల ఆర్థిక స్వావలంబన, భద్రత, నాయకత్వ వికాసానికి దోహదపడేలా రూపొందించామని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

**రోజు వారీ కార్యక్రమాలు**

- మే 25 – సౌర విద్యుత్ ప్లాంట్లు & ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు
- వికారాబాద్, ఖమ్మం, పెద్దపల్లి, కె. అసిఫాబాద్ ప్రాంతాల్లో 0.5 మెగావాట్ సౌర విద్యుత్ ప్లాంట్ల ప్రారంభం
- మహిళా సంఘాలచే నడిచే 450 RTC బస్సుల ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమం
- జిల్లా స్థాయిలో పోషకాహార అవగాహన కార్యక్రమాలు
- SHGలు, గ్రామ సంఘాల ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు
- మహిళా సంఘాలకు బ్యాకింగ్ లోన్లు, వడ్డీ లేని రుణాలు విడుదల, ఉత్తమ సంఘాల సత్కారం
- 2026-27 కార్యాచరణ ప్రణాళిక రూపకల్పన
- మే 26 – సామాజిక సమీకరణ దినం
- అర్హులైన మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బాలికల గుర్తింపు
- మిగిలిన మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చడం
- దివ్యాంగులు, వృద్ధ మహిళల SHGల ఏర్పాటు
- టీన్ ఏజ్ బాలికలతో మాక్ పార్లమెంట్ నిర్వహణ
- మే 28 – మౌలిక వసతుల నిర్మాణ కార్యక్రమాలు
- మహిళా సంఘ భవనాలు, వర్క్ షెడ్లు, మహిళా గోదాముల నిర్మాణాలకు శంకుస్థాపనలు
- భూమి పూజలు, పనుల ప్రారంభోత్సవాలు
- మే 29 – రుణమేళాలు & జీవనోపాధి యూనిట్ల గ్రౌండింగ్
- హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇంక్యుబేటర్ ప్రోగ్రాం ప్రారంభం
- మండల స్థాయిలో రుణమేళాలు
- మండల సమాఖ్యల ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు
- కోళ్ల పెంపకం యూనిట్లు-500, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటు
- బ్యాంక్ లింకేజ్ ద్వారా ఆర్థిక సహాయం
- కమ్యూనిటీ ఎంటర్‌ప్రైజ్ ఫండ్ మద్దతు
- ఆయిల్ బండ్లు, నెక్ ఎగ్ కార్ట్స్ పంపిణీ




- దివ్యాంగులకు బ్యాటరీ వాహనాల పంపిణీ
- వ్యవసాయ ప్రాసెసింగ్ యూనిట్లు, షేడ్ నెట్లు, 185 గోదాముల నిర్మాణాలకు భూమి పూజ
- తేనెటీగల పెంపకం యూనిట్లు, బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ల గ్రౌండింగ్
- మే 30&31 – మహిళల భద్రత & మౌలిక వసతుల ప్రారంభోత్సవాలు
- జిల్లా మహిళా సమాఖ్య భవనాల ప్రారంభం
- గుర్తించిన ప్రాంతాల్లో పెట్రోల్ పంపుల భూమిపూజలు
- జిల్లా సమాఖ్యల ప్రత్యేక సర్వసభ్య సమావేశాలు

టీన్ ఏజ్ బాలికలకు సైకిళ్ల పంపిణీ

- అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా చదువు నేర్చుకున్న మహిళలకు సత్కారం
- ఆరోగ్య శిబిరాలు, మహిళలకు ఆరోగ్య పరీక్షలు
- మహిళల భద్రత కోసం ప్రత్యేక వింగ్ కార్యక్రమాలు

పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రజా పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మహిళా సంఘాలను కీలక శక్తిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ఈ వారోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే మహిళా వారోత్సవాలను అధికారులు, మహిళా సంఘాలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు

# బక్రీద్ సెలవు తేదీ మార్పు



- ఏపీ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ
- మే 27 నుంచి మే 28కి సెలవు మార్పు
- చంద్రదర్శనం ఆధారంగా నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం
- అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు వర్తింపు
- వక్ఫ్ బోర్డు విజ్ఞప్తి మేరకు మార్పు
- సీఎస్ జి. సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ

**అమరావతి వెలుతురు మే 21:** ముస్లిం సమాజం భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగకు సంబంధించిన ప్రభుత్వ సెలవు తేదీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చింది. ముందుగా మే 27వ తేదీన సెలవుగా ప్రకటించినప్పటికీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో మే 28వ తేదీని అధికారిక సెలవుగా నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈ మార్పు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. గతంలో విడుదల చేసిన వార్షిక క్యాలెండర్ ప్రకారం మే 27న బక్రీద్ సెలవుగా నిర్ణయించారు. అయితే చంద్రదర్శనం ఆధారంగా పండుగ తేదీ మారిన నేపథ్యంలో సెలవు తేదీని కూడా సవరించాలని ఏపీ వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం, తేదీ మార్పుకు ఆమోదం తెలిపింది. అనంతరం అధికారికంగా మే 28న బక్రీద్ సెలవుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

# అవాస్తవాలు ప్రచారం చేస్తే కేసులు ఎదుర్కోక తప్పదు: జనసేన



**అమరావతి వెలుతురు మే 21:** తమ పార్టీపై కుట్రపూరిత ప్రచారాలు చేస్తున్న వారిపై ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని జనసేన స్పష్టం చేసింది. ఈ మేరకు పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. రాజకీయాల్లో పవిత్రతను దెబ్బతీసే విధంగా కొన్ని క్షుద్రశక్తులు తప్పుడు ప్రచారాలను వృత్తిగా మార్చుకున్నాయని ఆరోపించింది. ముఖ్యంగా కొన్ని ప్రసార మాధ్యమాలు జరిగింది జరగనట్లు, జరగనిదాన్ని జరిగినట్లు చూపిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించింది. ప్రజలు నిజం, అబద్ధం మధ్య తేడా గుర్తించలేని పరిస్థితి సృష్టిస్తూ రాజకీయ వ్యవస్థను కలుషితం చేస్తున్నారని పేర్కొంది.

ఇలాంటి ప్రచార కాలుష్యానికి అడ్డుకట్ట వేయాలని జనసేన సంకల్పించిందని తెలిపింది. పార్టీ, అధినేత పవన్ కళ్యాణ్, పార్టీ నాయకులపై ఎలాంటి అవాస్తవాలు, నిరాధార ఆరోపణలు చేసినా ఇకపై తక్షణమే పోలీసు కేసులు నమోదు చేసి న్యాయపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించింది. సోషల్ మీడియా, యూట్యూబ్, టీవీ చానళ్ల ద్వారా అసత్య ప్రచారాలు చేసే వారిని కూడా వదిలిపెట్టబోమని స్పష్టం చేసింది. ఎవరైనా, ఎంతటి స్థాయిలో ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని జనసేన పేర్కొంది.

# కోకోబి ప్లే జోన్ అండ్ పార్టీ అరేనా నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం




**ఎల్బీనగర్ వెలుతురు ప్రతినిధి మే 21:** బండ్లగూడ నాగోల్‌లో కోకోబి ప్లే జోన్ అండ్ పార్టీ అరేనా నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ప్రోటోకాల్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ హార్కర వేణుగోపాల్ రావు హాజరై నిర్వాహకులతో కలిసి నూతన బ్రాంచ్‌ను ప్రారంభించారు. అనంతరం అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి ఆట స్థలాలు ఎంతో అవసరమని అన్నారు. పిల్లలు సురక్షిత వాతావరణంలో ఆడుకుంటూ ఆనందంగా గడిపే విధంగా ఆధునిక సదుపాయాలతో ఈ ప్లే జోన్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కుటుంబ సభ్యులు కలిసి సంతోషంగా గడిపే వేదికగా ఈ పార్టీ అరేనా నిలవాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు మరిన్ని విజయాలు సాధించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం నాగోల్ లో ఎల్ బీ నగర్, ఏసీపీ కృష్ణయ్య, నాగోల్ సిఐ మక్బుల్ జానీ, అక్షయ్, దినేష్, చందన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026:

## విచక్షణతో కూడిన వినియోగం దిశగా ప్రయాణం



అంతర్జాతీయ యోగా దినోత్సవం (ఐడీవై)2026ను ఈ ప్రపంచం పాటిస్తున్న తరుణంలో మానవాళి ఒక సరికొత్త నాగరికతవైపు చూస్తున్నది. గొప్ప సాంకేతిక, భౌతిక పురోగతి సాధిస్తున్న యుగంలో మనం జీవిస్తున్నాం. అయినప్పటికీ పెరుగుతున్న జీవనశైలి రుగ్మతలనూ, అధికమవుతున్న మానసిక ఒత్తిడినీ, పర్యావరణ క్షీణతనూ, అస్థిరమైన జీవన విధానాలనూ సైతం ఎదుర్కొంటున్నాం. ఈ సమస్యల్లో చాలా వాటికి ముఖ్య కారణమైన ఉమ్మడి సవాలు ఒకటుంది —— అదే నియంత్రణ లేని, విచక్షణా రహితమైన వినియోగం. మితిమీరిన ధోరణిలో సహజ వనరులను దుర్వినియోగం చేయడం నుంచి డిజిటల్‌గా దొరికే ఆనందంపైనే అధికంగా ఆధారపడటం, అస్థిరమైన జీవనశైలి వరకూ.. ఆధునిక సమాజాలు సమతౌల్యానికి దూరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రాచీన ఆరోగ్య సాధనగా మాత్రమే కాకుండా.. బాధ్యతాయుతమైన జీవనానికి శాశ్వతమైన విధానంగా యోగా ఆవిర్భవించింది. తమకు అవసరమైన వాటిని స్వీయ నియంత్రణ, సంయమనం, విచక్షణతో ఎంచుకొనే మార్గాన్ని మానవాళికి యోగా అందిస్తుంది. మనలోనూ, మన చుట్టూ ఉన్న ప్రపంచంతోనూ సామరస్యాన్ని ఎలా పునరుద్ధరించుకోవాలో మనకు బోధిస్తుంది.

**విచక్షణతో కూడిన వినియోగానికి పిలుపు**

అధిక వినియోగం అనే ప్రపంచ సవాలును పరిష్కరించడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో ప్రారంభించిన మిషన్ లైఫ్ - పర్యావరణం కోసం జీవనశైలి అనే కార్యక్రమం మార్గనిర్దేశం అందిస్తోంది. "అవివేకమైన, విధ్వంసకరమైన వినియోగానికి బదులుగా ఆలోచనాత్మకమైన, వివేకవంతమైన వినియోగమే ఇప్పుడు మనకు అవసరం" - యోగాతత్వంలో ప్రతిధ్వనించే ఈ సూత్రాన్ని కాప్26లో ప్రధానమంత్రి చెప్పారు.ఇటీవలి కాలంలో ఎదురవుతున్న ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాల నేపథ్యంలో పైన పేర్కొన్న సూచనను రోజువారీ పౌర బాధ్యతగా ప్రధానమంత్రి విస్తరించారు. ఇంధనాన్ని ఆదా చేయడం, అనవసరమైన విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం నుంచి అత్యవసరం కాని ఖర్చులను పునరాలోచన వరకు నియంత్రణకు వీలున్న వినియోగాన్ని బాధ్యతగా తీసుకోవాలని పౌరులకు ప్రధాని విజ్ఞప్తి చేశారు. ఇది కొరత కారణంగా చేసిన వినతి కాదు. సామూహిక స్థిరత్వం, సుస్థిరత, జాతీయ బాధ్యత కోసం ఇచ్చిన వ్యూహాత్మకమైన, నైతికమైన పిలుపు. "ప్రతి నీటిబొట్టు కుండను నింపినట్లే.. చిన్నదైనా, పెద్దదైనా ప్రతి ప్రయత్నమూ ముఖ్యమైనదే" అని మనకు గుర్తు చేశారు.

యోగా మూల సూత్రాలతో ఈ ఆలోచనలన్నీ ముడిపడి ఉన్నాయి. అపరిగ్రహ - అంటే అనవసరమైన వాటిని పోగు చేయకుండా నియంత్రణ పాటించడం, సంతోష - అవసరమైన వాటితో తృప్తి పొందడం గురించి యోగా తత్వం చెబుతుంది. ఈ సూత్రాలన్నీ కలసి అనియంత్రిత వినియోగం నుంచి జాగరూకతతో కూడిన జీవన విధానం వైపు నడిచే మనస్తత్వాన్ని వ్యక్తుల్లో పెంపొందిస్తాయి. మనల్ని నిష్క్రియాపూరితమైన వియోగదారుల నుంచి ఈ గ్రహానికి బాధ్యతాయుతమైన సంరక్షకులుగా యోగా మారుస్తుంది.

**పర్యావరణ సామరస్యానికి సాధనంగా యోగా**

మానవ అవసరాలను తీర్చేందుకు తగినన్ని వనరులు భూమిపై ఉన్నాయి. కానీ అవి అంతులేని దురాశను తీర్చేందుకు ఏమాత్రం సరిపోవు. ఈ అవగాహనను పునరుద్ధరించడంలో యోగా సాయపడుతుంది. దీనికోసం ప్రకృతితో పరస్పర సంబంధ భావనను పెంపొందిస్తుంది. మనం పీల్చే గాలి, మనం తినే ఆహారం, మనం కోరుకునే స్థిరత్వం అన్నీ ఉమ్మడి పర్యావరణ వ్యవస్థలో భాగమే. యోగాభ్యాసం వల్ల మన ప్రవర్తన మనలోనే క్రమంగా పునర్నిర్మాణమవుతుంది. మానసిక అశాంతిని తొలగిస్తుంది. తొందరపాటుతనాన్ని తగ్గిస్తుంది. స్వీయ క్రమశిక్షణను బలోపేతం చేస్తుంది. తక్షణం లభించే తృప్తి, మితిమీరిన వినియోగంతో నడుస్తున్న ఈ ప్రపంచంలో వాస్తవ అవసరానికీ, అంతులేని కోరికకూ మధ్య ఉన్న తేడాను గుర్తించేందుకు అవసరమైన ఆత్మ స్పష్టతను యోగా అందిస్తుంది. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆయుష్ శాఖలకు చెందిన మంత్రిగా అసాంక్రమిక వ్యాధులను (ఎన్‌సీడీ) నివారించే ప్రజారోగ్య సాధనంగా యోగా ఎలా ఉపకరిస్తుందో నేను ప్రతి రోజూ చూస్తున్నాను. శారీరక శ్రమ, మానసిక సమతౌల్యం, క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని ప్రోత్సహించడం ద్వారా అనారోగ్యకరమైన అలవాట్లపై, అధిక ఔషధాల వినియోగంపై ఆధారపడటాన్ని యోగా తగ్గిస్తుంది. నిరాడంబరతను, సంయమనాన్ని, సమతుల పోషకాహారాన్ని, వృథాను తగ్గించడాన్ని, వనరులను బాధ్యతాయుతంగా వాడుకోవడాన్ని యోగా జీవనశైలి ప్రోత్సహిస్తుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే.. ఇవి పర్యావరణ సుస్థిరతకు అవసరమైన ప్రవర్తనా మార్పులు. వ్యక్తిగత ఆరోగ్యాన్ని సాధించే మార్గంగా మాత్రమే కాకుండా.. పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన ఆచరణాత్మక విధానంగానూ యోగా పని చేస్తుంది.

**ప్రపంచ ఆరోగ్యం... భారత్ నాయకత్వం**

ప్రపంచానికి భారత్ అందించిన అత్యంత ప్రభావవంతమైన కానుకల్లో ఒకటిగా, ఆరోగ్యం, సామరస్యం, సామూహిక శ్రేయస్సుకు సంబంధించిన శక్తిమంతమైన వ్యక్తీకరణగా యోగా మారింది. ప్రాచీన నాగరిక అభ్యాసంగా మొదలయిన యోగా నేడు భౌగోళిక, రాజకీయ, భాష, సంస్కృతి సరిహద్దులను దాటి ప్రపంచ ఉద్యమంగా మారింది.వివిధ ఖండాల్లోని కోట్లాది మంది ప్రజలు ఏటా యోగా వేడుకల్లో పాల్గొంటున్నారు. కేవలం ఆసనాలు వేయడానికి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన, మరింత సమతుల్యమైన, స్థిరమైన జీవితాన్ని గడపాలనే ఉమ్మడి ఆకాంక్షను స్వీకరిస్తున్నారు. అనారోగ్య నివారణ, మానసిక శ్రేయస్సు, బాధ్యతతో కూడిన జీవనశైలికి సంబంధించిన సార్వత్రిక భాషగా యోగా ఆవిర్భవించింది.యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం కోసం నిర్బంధం కాని సమ్మిళిత విధానాన్ని ఈ ప్రపంచానికి భారత్ అందించింది. ఇది ఆధునిక ఆందోళనలను కాలాతీతమైన విజ్ఞానంతో పరిష్కరిస్తుంది. అంతర్జాతీయ యోగా దినోత్సవం - 2026 ప్రాధాన్యమిదే. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాలను ప్రభావితం చేస్తుంది. కాబట్టి, పెద్ద ఎత్తున ప్రవర్తనా మార్పులను తీసుకువచ్చే అసమానమైన వేదికను అందిస్తుంది. యోగా అందించే సామూహిక స్ఫూర్తి ద్వారా సుస్థిరత, సంయమనం, విచక్షణతో కూడిన జీవితం లాంటి సందేశాలు మరింత దూరం ప్రయాణించి, బలంగా ప్రతిధ్వనిస్తాయి.

**ఐడీవై-2026 కోసం సామూహిక సంకల్పం**



నిజమైన సంక్షేమం ఒంటరిగా మనుగడ సాగించలేదు. మానవ ఆరోగ్యం, సామాజిక శ్రేయస్సు, భూమి ఆరోగ్యం ఒకదానితో ఒకటి బలంగా ముడిపడి ఉన్నాయి. వాతావరణ మార్పులు, జీవనశైలి వ్యాధులు, పర్యావరణ క్షీణత తదితర సవాళ్లకు విధానపరమైన చర్చలతో పాటు ప్రవర్తనలో మార్పు కూడా అవసరం.ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగా మ్యాట్ పరిధిని దాటి మన నిబద్ధతను విస్తరిద్దాం. దైనందిన సాధనగా మాత్రమే కాకుండా ఆలోచనాత్మక వినియోగం, అంతర్గత క్రమశిక్షణ, పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించే జీవిన విధానంగా యోగాను స్వీకరిద్దాం.చైతన్యవంతమైన జీవనానికి ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ.. వినియోగం ఆధారంగా కాకుండా ఎంత బాధ్యతాయుతంగా జీవిస్తున్నామనే దానిపై ఆధారపడి ప్రగతిని కొలిచే భవిష్యత్తును నిర్మిద్దాం.మన అంతర్గత వాతావరణాన్ని మార్చుకోవడం ద్వారా మనందరం కలసి మన భూ బాహ్య వాతావరణాన్ని పునరుజ్జీవింపచేద్దాం.

**(రచయిత ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి)**



**శ్రీ ప్రతాపరావ్ జాదవ్**

# ఎబోలా వైరస్ కల్లోలం

ఢిల్లీ వెలుతురు మే 21:

ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్ శరవేగంగా విస్తరిస్తూ భయాందోళనలు రేకెత్తిస్తున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆఫ్రికా ఖండంలో ఈ వైరస్ ఉధృతి విపరీతంగా ఉండటంతో, అక్కడ నుంచి భారతదేశానికి వచ్చే ప్రయాణికుల కోసం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలకమైన హెల్త్ అడ్వైజరీని జారీ చేసింది. ఈ మేరకు ఆరోగ్య శాఖకు చెందిన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. వైరస్ తీవ్రత ఎక్కువగా ఉన్న దేశాల నుంచి వచ్చే వారు దేశంలోకి అడుగుపెట్టే ముందే పూర్తి సమాచారం అందించాలని స్పష్టం చేసింది. ఎబోలా ప్రభావిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎయిర్‌పోర్టులలో ఇమ్మిగ్రేషన్ తనిఖీలకు వెళ్లడానికి ముందే అక్కడి ఆరోగ్య అధికారులను సంప్రదించాలని కేంద్రం ఆదేశించింది. ముఖ్యంగా డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డీఆర్‌సీ), ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికులలో ఎబోలాకు సంబంధించిన ఎలాంటి చిన్న లక్షణాలు కనిపించినా వెంటనే విమానాశ్రయ వైద్యాధికారులకు రిపోర్ట్ చేయాలని సూచించింది. కాంగో, ఉగాండా దేశాలలో వైరస్ వ్యాప్తి తీవ్రమవడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఇటీవల 'గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ' ప్రకటించిన నేపథ్యంలో కేంద్రం ఈ ముందస్తు రక్షణ చర్యలు చేపట్టింది. అయితే, ఇది ప్రపంచవ్యాప్త మహమ్మారి కాదని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసినప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు అవసరమని భారత్ భావిస్తోంది. కేంద్ర ఆరోగ్య శాఖ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం, ఎబోలా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చే వారిలో జ్వరం, తీవ్రమైన నీరసం, అలసట, తలనొప్పి, కండరాల నొప్పులు, వాంతులు, విరేచనాలు, గొంతు నొప్పి లేదా శరీరంలో ఎక్కడైనా అనూహ్యంగా రక్తస్రావం కావడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే అధికారులకు తెలపాలి. ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ కంటే ముందే ప్రయాణికులు ఈ వివరాలను వెల్లడించడం అత్యంత అవసరమని వైద్య నిపుణులు చెప్తున్నారు. ఎబోలా సోకిన రోగులతో లేదా వారి శరీర ద్రవాలు, రక్తంతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న ప్రయాణికులు కూడా తప్పనిసరిగా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని డీజీహెచ్ఎస్ స్పష్టం చేసింది. భారతదేశంలోకి ప్రవేశించిన తర్వాత కూడా ప్రయాణికులు 21 రోజుల పాటు తమ ఆరోగ్యాన్ని నిశితంగా గమనించుకోవాలని కేంద్రం సూచించింది. ఈ మూడు వారాల వ్యవధిలో పైన పేర్కొన్న లక్షణాలు ఏవైనా కనిపిస్తే, వెంటనే స్థానిక వైద్యులను సంప్రదించి తమ ఆఫ్రికా ప్రయాణ చరిత్రను (ట్రావెల్ హిస్టరీ) స్పష్టంగా వివరించాలి. అంతర్జాతీయ ఆరోగ్య నిబంధనలకు (ఐహెచ్ఆర్) కట్టుబడి ప్రతి ఒక్కరూ ఎయిర్‌పోర్టులలో స్క్రీనింగ్, క్వారంటైన్ పరీక్షలకు అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరింది. ఇతర ప్రయాణికులు మరియు దేశ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ నిబంధనలు ఎంతో కీలకమని కేంద్రం పేర్కొంది. ప్రస్తుతానికి భారతదేశంలో ఎబోలా వైరస్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు భరోసా ఇచ్చింది. అయినప్పటికీ, భవిష్యత్తులో ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా సమర్థవంతంగా తట్టుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య కార్యదర్శి పుణ్య సలిలా శ్రీవాస్తవ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ మేరకు కీలక ఆదేశాలు వెళ్లాయి. విమానాశ్రయాల్లో ప్రయాణికులను తనిఖీ చేయడం, అనుమానితులను క్వారంటైన్ చేయడం, ల్యాబ్ పరీక్షల నిర్వహణ మరియు ప్రత్యేక చికిత్సా విధానాలపై ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను ఇప్పటికే అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపినట్లు ఆమె వివరించారు. మరోవైపు, ఎబోలా వైరస్ సృష్టించిన కలకలం కారణంగా అంతర్జాతీయ దౌత్య సదస్సులపై కూడా దీని ప్రభావం పడింది. వచ్చే వారం దేశ రాజధాని ఢిల్లీలో వైభవంగా జరగాల్సిన '4వ భారత్‌ఆఫ్రికా ఫోరమ్ సదస్సు'ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ ఉన్నత స్థాయి సదస్సుకు ఆఫ్రికా ఖండం నుంచి వందలాది మంది కీలక నేతలు, ఉన్నతాధికారులు హాజరు కావాల్సి ఉంది. ప్రజా ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ఆఫ్రికన్ యూనియన్ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపిన తర్వాతే పరస్పర అంగీకారంతో ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నారు. అయితే సదస్సు వాయిదా పడినప్పటికీ, ఎబోలా మహమ్మారితో పోరాడుతున్న ఆఫ్రికా దేశాలకు అవసరమైన మందులు, వైద్య సహాయాన్ని అందించేందుకు భారత్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కేంద్రం ప్రకటించింది.ప్రస్తుతం ఆఫ్రికాలో ఎబోలా పరిస్థితి దారుణంగా ఉంది. కాంగోలో ఈ వైరస్ బారిన పడి ఇప్పటికే 88 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 300 మందికి పైగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పొరుగు దేశమైన ఉగాండాలోనూ ఈ వైరస్ కేసులు వెలుగుచూశాయి. 1976లో కాంగోలో ఎబోలాను మొదటిసారి కనుగొన్నప్పటి నుంచి ఇప్పటివరకు అక్కడ ఇలా వైరస్ విజృంభించడం ఇది 17వ సారి కావడం గమనార్హం. ఈ వైరస్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ప్రత్యేక వ్యాక్సిన్‌లు కానీ, నిర్దిష్ట చికిత్స కానీ అందుబాటులో లేకపోవడం వల్ల దీన్ని వెంటనే అదుపు చేయడం సవాలుగా మారిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. లక్షణాలు ఉన్నవారు ప్రయాణాలు చేయవద్దని కోరిన డబ్ల్యూహెచ్ఓ.. వైరస్ భయంతో దేశాల సరిహద్దులను పూర్తిగా మూసివేయవద్దని, వాణిజ్యాలపై ఆంక్షలు విధించవద్దని అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది.



# ఎం జే పి బ్రాండింగ్ క్రియేట్ చేయాలి









- **విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన జరగాలి**
- **8 వ తరగతి నుండే నీట్ ,ఎంసెట్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ చేయాలి**

**హైదరాబాద్ వెలుతురు మే 21:** మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాల పనితీరు పై మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన గురుకుల విద్యాసంస్థలు కారణాలు సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం మంచి ఫలితాలు సాధించేలా పని చేయాలిని ఆయన అన్నారు. సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలలు వచ్చే విద్యాసంవత్సరంలో రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉండాలని ఆదిశగా అధ్యాపక బృందం పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు , సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ, తదితర అంశాలపై ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలను అభిందించడంతో పాటు ఉత్తీర్ణత శాతం తక్కువగా వచ్చిన పాఠశాలల ప్రిన్సిపాల్ లను మందిలించారు. వచ్చే విద్యా సంవత్సరం లో మంచి ఫలితాలు రాబట్టాలని సూచించారు. గతంలో 327 స్కూల్ లలో 301 స్కూల్ లో ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయని, ప్రభుత్వం విద్యకు ప్రధాన్యత ఇవ్వడం తో గురుకులాలు అద్భుతంగా పని చేస్తున్నాయనీ తెలిపారు. గురుకుల పాఠశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, ప్రభుత్వం మెస్ ఛార్జీలు కాస్మొటిక్ చార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వం మీద విశ్వాసంతో ,అధ్యాపకుల విశ్వాసంతో తమ పిల్లలను గురుకులాలకు పంపిస్తున్నారనీ తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా ఉపాధ్యాయులతోనే పిల్లలు సమయం ఇస్తారని తమ సొంత పిల్లల మాదిరి విద్యార్థులను చూసుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు మంచైనా,చెడైనా అధ్యాపకులు దిక్సూచి అని తెలిపారు. 202627 సంవత్సరానికి రాష్ట్రంలోని అన్ని బీసీ సంక్షేమ శాఖ గురుకులాలు మరింత సమర్ధవంతంగా విజయాలు సాధించాలనీ ఆకాంక్షించారు. ఎవరిని ఇబ్బంది పెట్టి పని చేయించుకోవడం లేదనీ పూర్తి స్థాయిలో విద్యా బోధన జరగాలనీ ఆదేశించారు.ప్రైవేట్ భవనాల్లో నెల వారి అద్దె కడుతున్నప్పటికీ మౌలిక సదుపాయాలు లేకపోతే కల్పించుకునే బాధ్యత ప్రిన్సిపల్ లది సూచించారు.టాయిలెట్స్, ఫ్యాన్స్,ఇతర మౌలిక సదుపాయాలు ఏం ఇబ్బందులు లేకుండా చూసుకోవాలనీ తెలిపారు.ఎంజేపీ గురుకులాలు అద్భుతంగా ఉండాలంటే అందరూ కలిసి సమిష్టిగా ఒక కుటుంబం లాగ పని చేయాలన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు జ్ఞాపకులపై ఆధారపడి ఉందన్నారు. సమాజంలో ఏ విధంగా బతకాలి , డిసిప్లెన్, తల్లిదండ్రుల తో ఎలా వ్యవహరించాలి.. పెద్దలతో ఎలా మాట్లాడాలి అని విద్యార్థులకు నేర్పించాలని సూచించారు.చిన్న చిన్న కారణాలతో గురుకులాల్లో సూసైడ్ జరుగుతున్నాయని విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని కల్పించాలని వారిలో మోటివేటివ్ కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న స్కూల్స్ వారిగా సమీక్ష లు చేస్తూ వంద శాతం ఫలితాలు వచ్చిన స్కూల్స్ అభినందిస్తూ.. తక్కువ ఫలితాలు వచ్చిన స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలనీ సూచించారు. అధ్యాపకులంతా ఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలనీ పేర్కొన్నారు.ఇతర రాష్ట్రాల వారు కూడా మన విద్యా విధానం వచ్చి ఇక్కడ అధ్యయనం చేసేలా సమర్ధవంతంగా పని చేయాలన్నారు. పదవ తరగతి 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల సెక్రెటరీ సైదులు తో పాటు ప్రిన్సిపల్ లను అభినందించారు.500 పైన వచ్చిన మార్కులు 9788 మంది విద్యార్థులకు వచ్చాయనీ 204 ఎంజేపీ గురుకులాలు 100 శాతం ఫలితాలు సాధించాయనీ సంతోషం వ్యక్తం చేశారు.65 స్కూల్స్ వెనుకబడి ఉన్నాయనీ ఆ స్కూల్స్ ఆత్మపరిశీలిన చేసుకోవాలి ఉత్తీర్ణత తక్కువగా వస్తె మంచిది కాదనీ హెచ్చరించారు.ఫెయిల్ అయిన విద్యార్థులు తెలుగు లో సబ్జెక్ట్ లో ఎక్కువగా నిపిస్తున్నారనీ తెలుగు లో ఫెయిల్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.ప్రతి స్కూల్ లో ర్యాంకర్ల ఫోటో లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలనీగ్రామాల్లో గురుకులాల్లో వచ్చిన మార్కులు ఫలితాలు విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు.ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం ,ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం , ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో 85.80 శాతం, ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 95.81 శాతం పాస్ శాతం ఉందని 900 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 4183 మంది విద్యార్థులు ,980 మార్కులు పైన 496 మంది విద్యార్థులు సాధించారనీ ఇంటర్మీడియట్ లో తక్కువ ఉత్తీర్ణత శాతం వచ్చిన గురుకులాలను హెచ్చరించారు.35 విద్యాసంస్థలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయనీ అభినందించారు.ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 8 విద్యా సంస్థలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయన్నారు.ఎంజేపీ లో చదివిన పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులకు నేరుగా ఇంటర్మీడియట్ తరగతులకు అడ్మిషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.గురుకుల పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు ఇంకా ఏమి అవసరమని ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ఇంటర్మీడియట్ లో వచ్చిన ఫలితాలు మాదిరి tgeapcet లో ర్యాంకులు రావాలన్నారు.ప్రతి గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు.8 వ తరగతి నుండే నీట్ ,ఎంసెట్ ,కాంపిటీటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ చేయించాలన్నారు.జిల్లాలో గురుకుల పాఠశాలలు విజిట్ చేస్తాంమని పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ తప్పనిసరి చేసి ఎంజేపీ కి బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేయాలన్నారు.సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రెటరీ బాలమయాదేవి, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సెక్రటరీ సైదులు, ఆర్సీవో లు ,ప్రిన్సిపల్ లు హాజరయ్యారు.

---

## మాకు న్యాయం చేయండి.. మహాప్రభో....

- **గాంధీనగర్ నల్ల పోచమ్మ వాడ ఇల్లు , స్థలాలు, దుకాణాలు కోల్పోయిన బాధితులు**

**యాదగిరిగుట్ట , మే 21 వెలుతురు న్యూస్**



యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని గాంధీ నగర్ నల్ల పోచమ్మ వాడలో నివాస గృహాలు, స్థలాలు, దుకాణాలు మడిగలు కోల్పోయిన వారికి ప్రభుత్వం తగిన విధంగా పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని, తమకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఇండ్లు స్థలాలు , దుకాణాలు మడిగలు కోల్పోయిన బాధితుల జేఏసీ సభ్యులు తెలిపారు . గురువారం గాంధీనగర్ నల్ల పోచమ్మ వాడలో బాధితులు మీడియాతో మాట్లాడారు. యాదగిరిగుట్ట కొండ చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గాంధీనగర్ గోశాల గేటు నుండి మసీదు వరకు రోడ్డుకు ఎడమవైపున ఉన్న నివాస గృహాలు వ్యాపార సముదాయాలు మడిగలు గత ప్రభుత్వం తమ నుండి తీసుకుందని వారు తెలిపారు. ఇందుకు బదులుగా 329 సర్వే నెంబర్ లో నెమలి వెంచర్ లో ప్లాట్లు కేటాయించినప్పటికీ కోర్టు కేసుల వల్ల వాటిని తమకు స్వాధీనం చేయలేదని తెలిపారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో భాగం అయ్యేందుకు తాము ప్రభుత్వానికి సహకరించి ఇండ్లు ఇంటి స్థలాలు మడిగలు దుకాణాలు ఇచ్చినప్పటికీ తమకు ఇంతవరకు న్యాయం జరగలేదని అన్నారు. ఇంటికి ఇల్లు దుకాణానికి దుకాణం కేటాయిస్తామని గత ప్రభుత్వం చెప్పినప్పటికీ అమలు చేయలేదని ప్రస్తుతం తమ పరిస్థితి రోడ్డున పడి దీనావస్థ లో ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యలు తమకు న్యాయం చేయాలని అన్నారు . తమకు నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందజేయడంతో పాటు ఇంటికి ఇల్లు దుకాణానికి దుకాణం కేటాయించాలని కోరుతున్నామని అన్నారు . ఇప్పటికే ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులకు అనేక మార్లు వినతి పత్రాలు అందజేసినా తగిన స్పందన లేదని అన్నారు. తమకు న్యాయం జరిగే వరకూ తమ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బాధితులు రాచకొండ జానకిరామ్, చిత్తార్ల కృష్ణ, శివకోటి వీరస్వామి , కొంగరి లావణ్య , కాదునూరి కౌసల్య మోతే మదర్, పేరపు సిద్ధులు, పబ్బని లక్ష్మి , శివకోటి భాస్కర్, బి లలిత, తోట ఆంజనేయులు, మోతే వెంకటయ్య, గుజ్జ రాజేశ్వర్ , నాగభూషణం, ప్రేమ, సుల్తానా, మిట్ట చంద్రమౌళి , నవీన్ , ములుగు పోచమ్మ, పోరుగంటి దశరథ, ఎర్ర పోచయ్య, ఆకారపు ఎల్లయ్య, రామాంజనేయులు ,మోతే ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

---

## సుప్రీంకోర్టు తీర్పు పట్ల హర్షం.



**మోత్కూరు ,మే 21, (వెలుతురు న్యూస్) :** జనగణనలో కులగణన చేపట్టాలని సుప్రీంకోర్టు తీర్పు పట్ల బీసీ రిజర్వేషన్ సాధన సమితి హర్షం వ్యక్తం చేసింది. గురువారం ఈ మేరకు మోత్కూరు లో స్థానిక శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన కులాలు విద్యా, ఉద్యోగ ,ఆర్థిక సామాజిక అభివృద్ధికి చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి ఈ లెక్కలు అవసరమన్నారు. ఏ కులం ఏ రంగంలో వెనుకబడి ఉందో దాని అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకునే నిర్ణయాలకు కులాల లెక్కలు చాలా అవసరమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్ నేత, పట్టణ అధ్యక్షులు నిలిగోండ మత్స్యగిరి, గ్రంథాలయం చైర్మెన్ కోమటి మత్స్యగిరి, స్థానిక నాయకులు బయ్యని రాజు, చిలకమర్రి బాబుచారి, నల్ల నాగయ్య, మర్రి ఆనందం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

---

## పేదరికం నుంచి ప్రగతి వైపు-- మంత్రి సీతక్క ఆలోచనలు ఆచరణలో పెడుతున్న సెర్ప్



- **మహిళా రైతులకు గ్లోబల్ మార్కెట్ అవకాశాల కల్పన**

**హైదరాబాద్ వెలుతురు మే 21:** పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నేతృత్వంలోని సెర్ప్ (SERP) గ్రామీణాభివృద్ధిలో నూతన రంగాల్లో అడుగుపెడుతోంది. గ్రామీణ పేదరిక నిర్మూలనకు అసలైన అర్థం చెబుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని సన్న, చిన్నకారు రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే దిశగా వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా మహిళా రైతుల ఆదాయం పెంచే లక్ష్యంతో రైతులను నేరుగా మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ మధ్య దళారుల వ్యవస్థకు చెక్ పెడుతోంది. రైతులు పండించిన పంటలను మధ్యవర్తులు లేకుండా నేరుగా మార్కెటింగ్ వ్యవస్థను సెర్ప్ ఏర్పాటుచేసింది. అంతేకాకుండా ఆన్‌లైన్ మార్కెటింగ్, ఆధునిక రిటైల్ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లతో రైతులను అనుసంధానం చేస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తోంది. సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన “భేనిశాన్” రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య (FPC) రాష్ట్రంలోని మామిడి రైతులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వనపర్తి జిల్లా పెబ్బేరు గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణ దంపతులు ఈ సీజన్‌లో మల్లిక రకం మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయడం చిన్న రైతులకు కొత్త ఆశలు నింపింది. దీంతో ఇప్పటి వరకు మామిడి రైతులకు రూ.151 కోట్ల వ్యాపారం జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ విధానం ద్వారా రైతులకు అదనంగా 15 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం లభిస్తోందన్నారు. గతంలో కొద్దిపాటి ఉత్పత్తి ఉన్న రైతులకు జాతీయ అంతర్జాతీయ మార్కెట్లలకు ఎగుమతులు అసాధ్యంగా భావించేవారు. కానీ “బేనిశాన్” ద్వారా సమీకరణ, గ్రేడింగ్, ప్యాకింగ్, రవాణా, సప్లై చైన్ సదుపాయాలు కల్పించడం వల్ల చిన్న రైతులు కూడా దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు చేరుకునే అవకాశం లభిస్తోంది. రిలయన్స్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, మెట్రో క్యాష్ అండ్ క్యారీ, మోర్, స్టార్ బజార్, రత్నదీప్ వంటి ఆధునిక రిటైల్ సంస్థలతో పాటు పలు అగ్రో ప్రాసెసింగ్ కంపెనీలతో భేనిశాన్ ఒప్పందాలు కుదుర్చుకుంది. గతంలో చిన్న సన్న కారు రైతులు తక్కువ పంట ఉత్పత్తి చేయడం వల్ల పెద్ద వ్యాపారులు వారిని పట్టించుకునే పరిస్థితి ఉండేది కాదు. దీంతో దళారులకు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చేది. ఇప్పుడు FPOల ద్వారా రైతుల ఉత్పత్తులను సమీకరించి పెద్ద మార్కెట్లకు విక్రయించడం వల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. ప్రస్తుతం భేనిశాన్ సమాఖ్య పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 84 రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పనిచేస్తున్నాయి. ఇవి 30 జిల్లాలు, 404 మండలాలు, 3072 గ్రామాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. మొత్తం 1.09 లక్షల మంది సన్న, చిన్నకారు రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులే కావడం విశేషం. సెర్ప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రజిత నారెడ్ మాట్లాడుతూ, ఎగుమతులకు వెళ్లే ప్రతి పండును నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా ఎంపిక చేసి ప్రాసెస్ చేస్తున్నామని తెలిపారు. మామిడి పండ్ల నాణ్యత కాపాడేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో తెంపడం, గ్రేడింగ్ వంటి ప్రక్రియలపై రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వివరించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన అంటే కేవలం పథకాల అమలు మాత్రమే కాదని, గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయం వచ్చే వ్యవస్థను నిర్మించడమే అసలు లక్ష్యమని మంత్రి సీతక్క ఆలోచనలకు అనుగుణంగా సెర్ప్ ద్వారా రైతులకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. రైతు పండించిన పంటకు మార్కెట్ కల్పించడం, మధ్యదళారుల ఆధిపత్యాన్ని తగ్గించడం, మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం దిశగా సెర్ప్ తీసుకుంటున్న చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

---

## బుద్ధ భవన్ లో మహిళా కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయ లక్ష్మీ

- **శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్ వెలుతురు మే 21:** మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళా కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయ లక్ష్మీ గారికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారం, వారి అభ్యున్నతి, అభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణ కోసం సమర్థవంతంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. మేయర్‌గా పనిచేసిన అనుభవంతో మహిళా కమిషన్ చైర్మన్‌గా మరింత విజయవంతంగా ముందుకు సాగుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావడానికి కృషి చేయాలని సూచించారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7231/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com